
ఆంధ్రజ్యోతి
****
ANDHRAJYOTHY
నల్లగొండ
5
ఆదివారం 5 జనవరి 2025



హెల్ప్‌లైన్ నంబర్లు

దివ్యాంగులు, సీనియర్ సిటిజన్స్ సంక్షేమ శాఖ టోల్‌ఫ్రీ నెంబర్ 18005728980

నల్లగొండ	:18004251442
యాదాద్రి	:1800 425 7106
సూర్యాపేట	:1800 425 1972

చికెన్ ధరలు

గుడ్డు డజన్ ధర : 84

జిల్లా	లైవ్	డ్రెస్	స్కిన్‌లెస్
యాదాద్రి	రూ.117	190	210
సూర్యాపేట	రూ.125	180	210
నల్లగొండ	రూ.130	180	200

ఉష్ణోగ్రత గరిష్ఠం 29.0 । కనిష్ఠం 17.4



నేడు ముగ్గుల పోటీలు

నల్లగొండ, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండుగను పురస్కరించుకుని 'ఆంధ్రజ్యోతి, ఏబీఎన్ నిర్వహిస్తున్న సంతూర్ ముత్యాల ముగ్గుల పోటీలు, గార్డెనింగ్ పార్ట్‌నర్ క్రాఫ్ట్‌వారి పర్‌ఫెక్ట్, ఫ్యాషన్ పార్ట్‌నర్ డిగ్‌సెల్ వారి సెల్సియా (ట్రెండీ మహిళల ఇన్నర్‌వేర్), లక్ష్మీప్రసన్న 2కె పేయింట్స్ సంయుక్తంగా ఈ నెల 5న ఆదివారం నల్లగొండ ఎన్జీ కళాశాలలో నిర్వహించనున్నారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పోటీలు జరగనున్నాయి. 9985411392, 8074742266 నంబర్లకు ఫోన్‌చేసి పేరు నమోదు చేసుకోవాలని 'ఆంధ్రజ్యోతి' బ్రాంచ్ మేనేజర్ దాసరి చంద్రశేఖర్ ఈ పోటీల్లో విజేతలుగా నిలిచినవారికి బహుమతులు అందజేస్తారు.



మళ్లీ గ్రామస్థాయిలో రెవెన్యూ అధికారి

- నెలాఖరులోగా వీఎల్‌వోలు వచ్చే అవకాశం
- వేరే శాఖల్లోకి బదలాయించిన వీఆర్వోలకు ఆప్షన్
- వీఆర్ఏల వారసులకూ అవకాశమివ్వాలనే సూచనలు
- గ్రామానికి కీలకంగా రెవెన్యూ అధికారి

గ్రామ రెవెన్యూ వ్యవస్థ పునరుద్ధరణకు రంగం సిద్ధమవుతోంది. రెండున్నరేళ్ల క్రితం అవినీతికి పరాకాష్ట ఈ వ్యవస్థేనంటూ వీఆర్వో పోస్టులను గత బీఆర్ఎస్ సర్కార్ రద్దు చేసి వీఆర్వోలతోపాటు వీఆర్ఏలను ఇతర శాఖల్లో సర్దుబాటు చేసింది. తాజాగా, భూభారతి బిల్లు ఆమోదం పొందడం, రాష్ట్రంలో రెవెన్యూ వ్యవస్థను గాడినపెట్టేందుకు ప్రభుత్వం సిద్ధమయిన నేపథ్యంలో గ్రామస్థాయిలో మళ్లీ వీఆర్వో (విలేజ్ రెవెన్యూ అధికారి) స్థానంలో గ్రామస్థాయి పాలనాధికారిని, సర్వేయర్లను నియమించాలని ప్రభుత్వం నిర్ణయించింది. పోస్టుకు గతంలో పనిచేసిన వీఆర్వోలు, వీఆర్ఏలను దరఖాస్తు చేసుకోవాలని సూచించింది. దీంతో పలువురు వీఆర్వోలు, వీఆర్ఏలు తిరిగి మాతృశాఖకు వచ్చేందుకు సిద్ధమవుతూ దరఖాస్తులను సీసీఎల్ఏకు సమర్పించారు. దరఖాస్తుల స్వీకరణ ఇప్పటికే పూర్తవడంతో, జనవరి నెలాఖరు నాటికి ఉద్యోగాలను ఖరారుచేస్తూ నోటిఫికేషన్ ఇచ్చే అవకాశం ఉందని భావిస్తున్నారు.

- (ఆంధ్రజ్యోతి ప్రతినిధి,నల్లగొండ)

అవినీతి పెరిగిందని, క్షేత్రస్థాయిలో రెవెన్యూ అధికారుల అవసరమేలేదనే అభిప్రాయంతో 2022లో అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం వీఆర్వో వ్యవస్థను రద్దుచేసింది. అప్పటికే వీఆర్వోలుగా, వీఆర్ఏలుగా పనిచేస్తున్నవారిని వారి అర్హతల ఆధారంగా ఇతర శాఖలల్లోకి బదలాయించింది. జూనియర్ అసిస్టెంట్లుగా, సీనియర్ అసిస్టెంట్లుగా, అటెండర్లుగా ఆయా శాఖల్లో వీరంతా పనికి అలవాటుపడలేక మానసిక వేదన అనుభవించిన వారు కూడా ఉన్నారు. వీఆర్వో అంటే గ్రామంలో కీలకమైన అధికారిగా కేవలం భూముల రికార్డుల నిర్వహణకే పరిమితం కాకుండా, అధికారుల పర్యటనలు, ప్రజాప్రతినిధుల పర్యటనల సందర్భంలో కీలకంగా వ్యవహరించేవారు. అలాంటి కీలకమైన వ్యవస్థను గత ప్రభుత్వం నిందారోపణలతో రద్దుచేసిందనే అభిప్రాయంతో ఉన్న వీఆర్వోలు తాజాగా, ప్రభుత్వం మళ్లీ ఈ వ్యవస్థను పునరుద్ధరిస్తుండడంపై హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో 73 మండలాలకు 1,138 రెవెన్యూ గ్రామాలున్నాయి. ప్రస్తుతం ప్రతీ రెవెన్యూ గ్రామానికి ఒక వీఎల్వోను నియమించనున్నారు. రద్దయిన సమయంలో ఉమ్మడి జిలాలో 1,015 మంది వీఆర్వోలు, 341 మంది వీఆర్ఏలను ఇతర శాఖలకు బదలాయించారు. వీరందరికీ తాజాగా మళ్లీ రెవెన్యూశాఖలోకి వచ్చేందుకు ఆప్షన్ ఇచ్చారు. వారి విద్యార్హతలు, అనుభవం, వయసు ఆధారంగా దరఖాస్తు చేసుకునేందుకు గత డిసెంబరు 28 వరకు గడువిచ్చారు. ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు తీసుకున్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సుమారు 900 మంది వరకు పాతవీఆర్వోలు, 300 వరకు వీఆర్ఏలు దరఖాస్తు చేసుకున్నట్టు సమాచారం.

గ్రామానికి కీలకమైన అధికారిగా బాధ్యతలు

గ్రామస్థాయిలో పనిచేసే గ్రామ రెవెన్యూ అధికారులు కీలకమైన బాధ్యతలు నిర్వర్తించేవారు. నిజాం హయాం నుంచి రాష్ట్రంలో ఈ వ్యవస్థ కొనసాగుతూ వచ్చింది. భూరికార్డుల నిర్వహణ, గ్రామంలో నిఘా వ్యవస్థతో పాటు, స్వాతంత్ర్యానంతరం భూముల పన్నుల వసూళ్లు, అదేవిధంగా ఆదాయ, కుల ధ్రువీకరణ పత్రాలు,ఎన్నికల సమయంలో గ్రామాధికారిగా విధులు నిర్వహించేవారు. అదేవిధంగా ఏదైనా సంఘటనలు జరిగినప్పుడు క్షేత్రస్థాయి నివేదికలు ఇవ్వడం, ప్రమాదాలు జరిగినప్పుడు ప్రాథమిక సమాచారమివ్వడం, పంచనామాలు....

- మిగతా 7వ పేజీలో...

రెవెన్యూ అధికారిని నియమించాలనే నిర్ణయం హర్షనీయం



గ్రామస్థాయిలో రెవెన్యూ శాఖను మళ్లీ పునరుద్ధరించడం హర్షనీయం. గ్రామస్థాయిలో పనిచేసే రెవెన్యూ అధికారి ప్రభుత్వానికి ప్రతినిధిగా అనేక పనులు నిర్వహించేవారు. పొరపాట్లు, తప్పిదాలు జరిగితే సరిచేసే యంత్రాంగాన్ని నియమించాలి. తప్పులకుపాల్పడితే కఠినశిక్షలు వేయాలే తప్ప వ్యవస్థను రద్దుచేయడం సరికాదు. తాజాగా, ప్రభుత్వం మళ్లీ వీఆర్వో వ్యవస్థను ఏదో రూపంలో ప్రవేశపెట్టాలని నిర్ణయించడాన్ని స్వాగతిస్తున్నాం.

- రంగారావు, నల్లగొండ జిల్లా వీఆర్వోల సంఘం మాజీ అధ్యక్షుడు

బతుకులు ఛిద్రం

- ప్రీమియర్ ఎక్స్‌ప్లోజివ్స్‌లో భారీ పేలుడు
- యాదగిరిగుట్ట మండలంలో ఘటన
- నల్లగొండ జిల్లా తిప్పర్తిలో రోడ్డు ప్రమాదం
- రెండు ఘటనల్లో ముగ్గురి దుర్మరణం



భువనగిరి ఆస్పత్రి వద్ద రోదిస్తున్న కార్మికుల కుటుంబసభ్యులు

అనుకోని ప్రమాదాలు వారి జీవితాలను ఛిద్రం చేశాయి. పొట్టకూటి కోసం పరిశ్రమకు పనికి వెళితే.. అకస్మాత్తుగా జరిగిన ప్రమాదంలో ఒకరు మృత్యువాత పడగా. ముగ్గురు గాయాలపాలయ్యారు. యాదాద్రి భువనగిరి జిల్లా యాదగిరిగుట్ట మండలంలో ప్రీమియర్ ఎక్స్‌ప్లోజివ్స్‌లో భారీ పేలుడు సంభవించింది. ఈ ఘటనతో కంపెనీ చుట్టుపక్కల గ్రామస్థులు ఉలిక్కిపడ్డారు. ఐదు కిలోమీటర్ల వరకు శబ్దంతో స్థానికులు భయకంపితులయ్యారు. అదే విధంగా నల్లగొండ జిల్లా తిప్పర్తి మండలంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు దుర్మరణం చెందారు. ఈ ఘటనలో ఓ మహిళ, ద్విచక్రవాహనదారుడు మృత్యువాత పడ్డారు. 7

రోడ్డు భద్రతా మాసోత్సవాలు నిర్వహించాలి

కలెక్టర్ ఇలాత్రిపాఠి



వీడియోకాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న మంత్రి పొన్నం, పాల్గొన్న కలెక్టర్ ఇలాత్రిపాఠి, ఎస్పీ శరత్‌చంద్ర పవార్

నల్లగొండ టౌన్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా ఈ 1వ తేదీ నుంచి నెలరోజుల పాటు నిర్వహిస్తున్న రోడ్డు భద్రతా మాసోత్సవాలను విజయవంతం చేయాలని బీసీ సంక్షేమశాఖ, రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. శనివారం హైదరాబాద్ నుంచి రవాణాశాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ వికాస్‌రాజ్‌తో కలిసి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. గతంలో రోడ్డు భద్రత వారోత్సవాలు జరిగేవని, కేంద్ర ప్రభుత్వం రోడ్డు భద్రత ప్రాధాన్యాన్ని దృష్టిలో ఉంచుకొని వారోత్సవాలకు బదులు మాసోత్సవాలు నిర్వహించేందుకు నిర్ణయించినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో అన్ని శాఖలను భాగస్వామ్యం చేయాలని, జిల్లా స్థాయి మొదలు గ్రామస్థాయి వరకు అందరికీ అవగాహన కల్పించాలన్నారు. మండల కేంద్రాలతో పాటు, జిల్లా కేంద్రాల్లో ర్యాలీలు నిర్వహించాలని, అన్నిచోట్ల ప్లెక్సీలు ఏర్పాటు చేయాలని, సినిమా థియేటర్లలో స్లైడ్స్ ద్వారా, పోస్టర్లు, బ్యానర్ల ద్వారా ప్రచారం కల్పించాలన్నారు. కలెక్టర్ ఇలాత్రిపాఠి మాట్లాడుతూ, జిల్లా విద్యా వైజ్ఞానిక ప్రదర్శనలో విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు గోడపత్రికను ఆవిష్కరించామన్నారు. జాతీయ రహదారులపై 57 బ్లాక్ స్పాట్స్‌ను గుర్తించి అక్క ప్రమాదాలు జరగకుండా చర్యలు చేపట్టినట్టు వివరించారు. మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డితో పాటు, ఇతర ప్రజాప్రతినిధులను సమన్వయం చేసుకొని జిల్లా, మండల స్థాయిలో నెలాఖరులోపు అవగాహన ర్యాలీలు నిర్వహిస్తామని తెలిపారు. ఎస్పీ శరత్‌చంద్ర పవార్ మాట్లాడుతూ, జిల్లా యంత్రాంగం, పోలీస్‌శాఖతో కలిసి తీసుకున్న చర్యలతో గతంతో పోల్చితే 17 బ్లాక్ స్పాట్స్ తగ్గాయని, ప్రస్తుతం 49 బ్లాక్ స్పాట్స్ ఉన్నాయని వివరించారు. జాతీయ రహదారులపై డ్రైవర్లకు కంటి పరీక్షల నిర్వహణకు ప్రణాళిక రూపొందిస్తున్నామని తెలిపారు. దీంతో మంత్రి పొన్నం స్పందిస్తూ డ్రైవర్లకు కంటి పరీక్షలు నిర్వహించే ఆలోచన వినూత్నంగా ఉందని కలెక్టర్‌ను అభినందించారు. వీడియోకాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ జే.శ్రీనివాస్, జిల్లా రవాణాశాఖ డిప్యూటీ కమిషనర్ వాణి, ఆర్టీవో లావణ్య, తదితరులు పాల్గొన్నారు.

డ్రైనేజీ సమస్యను రూపుమాపేందుకు చర్యలు

'ఆంధ్రజ్యోతి' ఫోన్ ఇన్‌లో నల్లగొండ మునిసిపల్ కమిషనర్ సయ్యద్ ముసాబ్ అహ్మద్



'ఫోన్ ఇన్' కార్యక్రమంలో ప్రజల సమస్యలను తెలుసుకొని నోట్ చేసుకుంటున్న మునిసిపల్ కమిషనర్ సయ్యద్ ముసాబ్ అహ్మద్

నల్లగొండ టౌన్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ పట్టణంలో నెలకొన్న అండర్ గ్రౌండ్ డ్రైనేజీ సమస్యను సమూలంగా రూపుమాపేందుకు తగిన చర్యలు తీసుకుంటాం.. అందులో భాగంగా రూ.216కోట్లతో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణ పనులు ప్రారంభించాం.. అని నల్లగొండ మునిసిపల్ కమిషనర్ సయ్యద్ ముసాబ్ అహ్మద్ అన్నారు. శనివారం 'ఆంధ్రజ్యోతి' నిర్వహించిన ఫోన్‌ఇన్ కార్యక్రమంలో భాగంగా పట్టణ ప్రజలు అడిగిన పలు ప్రశ్నలకు కమిషనర్ సమాధానం ఇచ్చారు. 8

సింగిల్‌పర్మిట్‌తోనే మనుగడ

- ఏడాది గడిచినా కొలిక్కిరాని పర్మిట్ విధానం
- లబోదిబోమంటున్న 7వేల మంది లారీ ఓనర్లు 6



కూలి గిట్టుబాటు కావాలి

డీఆర్‌డీఏ పీడీ శేఖర్‌రెడ్డి



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న శేఖర్‌రెడ్డి

మిర్యాలగూడ, మిర్యాలగూడరూరల్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి):ప్రతీ ఉపాధి కూలీకి రోజుకు రూ.300 వేతనం పొందేలా చూడాలని డీఆర్‌డీఏ పీడీ వై.శేఖర్‌రెడ్డి అన్నారు. శనివారం మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన క్లస్టర్ సమావేశంలో ఆయన మాట్లాడారు. రోజుకు 5 నుంచి 6గంటలు కూలీలు పనిచేసేలా చూడాలని, రూ.300 వేతనం పొందేలా కొలతలు నిర్ధారించాలని సూచించారు. విధుల్లో అలసత్వం ప్రదర్శిస్తే క్రమశిక్షణా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పనుల ప్రదేశాన్ని క్షేత్రస్థాయి నుంచి రెండు సార్లు ఫొటో అప్‌లోడ్ చేయాలన్నారు. ప్రతీ గ్రామపంచాయతీలో జనవరిలో 25 మంది, ఫిబ్రవరిలో 50 మంది, మార్చిలో 80మంది కూలీలు పనిచేసేలా చూడాలని సూచించారు. గ్రామాల వారిగా మొక్కల లక్ష్యానికి అనుగుణంగా నర్సరీల్లో బ్యాగ్ ఫిల్లింగ్ పూర్తి చేయాలన్నారు. ప్రతీ గ్రామంలో 1,000 ఈత, తాటి మొక్కలు పెంచాలన్నారు. కమ్యూనిటీ ప్లాంటేషన్ 20శాతం, అవెన్యూ ప్లాంటేషన్ 20 శాతం, బండ్ ప్లాంటేషన్ 20శాతం, ఈత, తాటి 10, తుమ్మ 5, పెరటి మొక్కలు 15, బయో ఫెన్సింగ్ మొక్కలు10 శాతం ఉండేలా నర్సరీల్లో మొక్కలు పెంచాలన్నారు. అనంతరం సోమారిగూడెం, నిడమనూరు ఫీల్డ్ అసిస్టెంట్ బాలకృష్ణ, పంచాయతీ కార్యదర్శి సతీ‌స్‌ను సన్మానించారు. కార్యక్రమంలో అదనపు పీడీ నవీన్ కుమార్, ఏపీడీ బాలకృష్ణ, చారి, తదితరులు పాల్గొన్నారు.

రైతులకు షరతులు దుర్మార్గం

మాజీ మంత్రి జగదీష్‌రెడ్డి 6

రైతులు డిక్లరేషన్ ఇవ్వాలనడం శోచనీయం

నియోజకవర్గ అభివృద్ధికి నిధులివ్వండి



సీఎంకు వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే వేముల వీరేశం

నార్కట్‌పల్లి, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): నకిరేకల్ నియోజకవర్గ అభివృద్ధికి నిధు లు మంజూరు చేయాలని కోరుతూ నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం శనివారం సీఎం రేవంత్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి వినతి పత్రం అందజేశారు. అదేవిధంగా శాలువాతో సత్కరించి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

పంటల నమోదు సర్వేకు బ్రేక్

నల్లగొండ, జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం ఉమ్మడి నల్లగొండ జిల్లా వ్యాప్తంగా శనివారం నుంచి పంటల నమోదు సర్వే చేపట్టాలని అధికారులకు ఆదేశాలు జారీ చేసిన విషయం తెలిసిందే. అయితే యంత్రాంగం అంతా సర్వేకు సిద్ధమైనప్పటికీ వ్యవసాయ శాఖ రూపొందించిన యాప్ ఓపెన్ కాకపోవడంతో నల్లగొండ, యదాద్రి భువనగిరి, సూర్యాపేట జిల్లాలోని 73 మండలాల్లో 73 గ్రామాల్లో పంటల నమోదు సర్వేను చేపట్టలేకపోయారు. క్షేత్రస్థాయిలో పంటల నమోదును ఎంపిక చేసిన 73 గ్రామాల్లో 400 నుంచి 500 ఎకరాల వరకు ప్రతీ గ్రామంలో సర్వే చేయాల్సి ఉంది. అయితే యాప్ ఓపెన్ కాకపోవడంతో నిలిచిపోయింది. ఈ పరిస్థితి రాష్ట్ర వ్యాప్తంగా ఉన్నట్లు సమాచారం. రైతుభరోసాను సంక్రాంతి పండుగ నుంచి అమలు చేయాలనుకున్న సమయంలో అనూహ్యంగా ఈ సర్వే చేపట్టడం సర్వత్రా చర్చనీయాంశమైంది. ఆదివారం ప్రభుత్వ కార్యాలయాలకు సెలవు కావడంతో సర్వే ప్రక్రియపై సోమవారం నిర్ణయం వెలువడే అవకాశాలు ఉన్నాయి.

అధిక ధరలకు విక్రయిస్తే లైసెన్సులు రద్దు

బస్తా యూరియా రూ.266లకు విక్రయించాలి

హుజూర్‌నగర్, జనవరి 4(ఆంధ్రజ్యోతి): యూరియా బస్తాను రూ.266 లకు విక్రయించాలని, అధిక ధరలకు విక్రయిస్తే డీలర్ల లైసెన్స్‌లు రద్దు చేస్తామని సూర్యాపేట జిల్లా వ్యవసాయాధికారి శ్రీధర్‌రెడ్డి హెచ్చరించారు. 'దొడ్డు యూరియా పేరుతో దోపిడీ' శీర్షికతో ఆంధ్రజ్యోతిలో గురువారం ప్రచురితమైన కథనానికి ఆయన స్పందించారు. శనివారం సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ పట్టణంలోని పలు ఫర్టిలైజర్ దుకాణాలను ఆయన తనిఖీ చేశారు. అనంతరం ఏడీఏ కార్యాలయంలో ఫర్టిలైజర్ దుకాణాల యజమానులతో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎమ్మార్పీ ధరకే యూరియా బస్తా విక్రయించాలని సూచించారు. అధిక ధరలకు విక్రయిస్తున్న దుకాణాలపై చర్యలు తీసుకుంటామని, అవసరమైతే వారి లైసెన్స్‌లు రద్దు చేస్తామన్నారు. సన్నదయినా, దొడ్డు యూరియా అయినా 46 శాతం నత్రజని ఉంటుందన్నారు. రైతులు రెండు యూరియాలను సమానంగా వాడుకోవచ్చన్నారు. సహకార సంఘాల్లో యూరియా రూ.266లకే విక్రయిస్తారన్నారు. కార్యక్రమంలో ఏడీఏ రవీందర్, ఏవో స్వర్ణ, ఎరువుల డీలర్లు పాల్గొన్నారు.

బీసీ రిజర్వేషన్లపై స్పష్టత వచ్చాకే స్థానిక ఎన్నికలు నిర్వహించాలి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న జాజుల శ్రీనివాస్‌గౌడ్


నాంపల్లి, జనవరి 4(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం జనాభా దామాషా ప్రకారం బీసీ రిజర్వేషన్లను ప్రకటించిన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని బీసీ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం నల్లగొండ జిల్లా నాంపల్లి మండలకేంద్రంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశంలోనే మొదటిసారిగా రాష్ట్రంలో బీసీ కులగణన చేపట్టినందుకు సంతోషంగా ఉందన్నారు. ఆ కులగణన పూర్తిస్థాయిలో నిర్వహించి బీసీ జనాభ దామాషా ప్రకారం బీసీలకు రిజర్వేషన్లు కల్పించాలని కోరారు. కామారెడ్డి బీసీ డిక్లరేషన్ మేరకు బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తేనే బీసీలకు న్యాయం జరుగుతుందన్నారు. బీసీల రిజర్వేషన్ల ఏర్పాటుకు నిపుణులు, రాజ్యాంగ మేధావులతో చర్చించి బీసీ రిజర్వేషన్లకు చట్టబద్ధత కల్పించాలన్నారు. బీసీ రిజర్వేషన్ల అమలు విషయంలో కాంగ్రెస్ పార్టీపై తమకు నమ్మకం ఉందన్నారు. ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత బీసీలను విచ్ఛిన్నం చేయడానికే వెలమ కులస్తులను బీసీలో చేర్చడానికి కుట్రలు చేస్తూ బీసీ నినాదం ఎత్తుకుందన్నారు. వారి కుట్రలను తెలంగాణ ప్రజలు గమనిస్తున్నారన్నారు. కార్యక్రమంలో బీసీ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కులకచర్ల శ్రీనివాస్, బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మహేష్, యువజన సంఘం రాష్ట్ర కార్యదర్శి పానగంటి కృష్ణ, జాజుల భాస్కర్, భరత్, పానగంటి వెంకటయ్య, ఈద శేఖర్, కోరే శివ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి సైన్స్ ఇన్‌స్పైయిర్‌కు కేతేపల్లి విద్యార్థి



కార్తీక్

కేతేపల్లి, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా కేతేపల్లి మండలకేంద్రంలోని జడ్పీ పాఠశాలకు చెందిన ఏడో తరగతి విద్యార్థి కే కార్తీక్ రాష్ట్రస్థాయి సైన్స్ ఇన్‌స్పైయిర్ ప్రదర్శనకు ఎంపికయ్యాడు. నల్లగొండ జిల్లా కేంద్రంలో నిర్వహిస్తున్న జిల్లాస్థాయి ఇన్‌స్పైయర్ పోటీల్లో కార్తీక్ ఆటోమేటిక్ హ్యాండ్ శానిటైజర్ అనే అంశంపై ఇచ్చిన ప్రదర్శనతో జూనియర్ విభాగంలో జిల్లా స్థాయి మొదటి బహుమతి సాధించాడు. దీంతో ఈ నెల 6న జడ్చర్లలో నిర్వహించే రాష్ట్ర స్థాయి సైన్స్ ఇన్‌స్పైయిర్ ప్రదర్శనకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు వై.నర్సిరెడ్డి తెలిపారు. రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన కార్తీక్‌ను శనివారం పాఠశాల ఉపాధ్యాయులు, తోటి విద్యార్థులు అభినందించారు.



విద్యార్థిని అభినందిస్తున్న ఎంఈవో పద్మ , ఉపాధ్యాయులు

కనగల్ : నల్లగొండ జిల్లా కనగల్ ఉన్నత పదో తరగతి విద్యార్థి చిత్రం తాత్విక్ రాష్ట్ర స్థాయి ఇన్‌స్పైయర్ పోటీలకు ఎంపికయినట్లు ప్రధానోపాధ్యాయురాలు విద్యాభార్గవి, గైడ్ టీచర్ ఆరూరి జానయ్య తెలిపారు. తాత్విక్ వాటర్ షెడ్యూల్ ఫర్ అగ్రికల్చర్ పర్పస్ అనే అంశంపై రూపొందించిన ప్రాజెక్ట్ రాష్ట్రస్థాయి ప్రదర్శణకు ఎంపికైందని వారు తెలిపారు. తాత్విక్‌ను ఉపాధ్యాయులు అభినందించారు.

వివాదాస్పద స్థలంలో 164 సెక్షన్ విధింపు

నార్కట్‌పల్లి, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి మండలకేంద్రంలోని వివాదాస్పద కూరగాయల అంగడిస్థలం వద్ద బీఎన్ఎస్ఎస్ సెక్షన్ 164ను తహసీల్దార్ ఎల్.వెంకటేశ్వర్‌రావు విధించారు. ఈ మేరకు ప్రొసీడింగ్స్ జారీచేశారు. 18గుంటల ఈ స్థలంపై గతంలో రెండు వర్గాల మధ్య వివాదం తలెత్తగా శాంతిభద్రతల నిమిత్తం 164ను విధించినట్లు పేర్కొన్నారు. ఈ స్థలానికి సంబంధించి గతంలో జరిగిన ఘర్షణలు, వివాదాలకు బాధ్యులుగా ఇరువర్గాలకు చెందిన 11 మందిని ఎస్ఐ క్రాంతికుమార్ తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేశారు.

సింగిల్ పర్మిట్‌తోనే మనుగడ

● సంవత్సరం గడిచినా కొలిక్కిరాని వైనం

● లబోదిబోమంటున్న 7వేల మంది లారీ ఓనర్స్

ఆర్థిక వ్యవస్థకు ప్రధాన వనరుగా ఉన్న రవాణా రంగంలో లారీ యజమానుల పరిస్థితి ఇబ్బందికరంగా తయారైంది. వార్షిక బడ్జెట్‌కి సగం ఆదాయం సమకూర్చే నిర్వాహకులు ఆదాయం లేక వాహనాలు నడపలేకపోతున్నారు. ఉమ్మడి రాష్ట్రంలో 7,76,231 లారీలు సరుకు రవాణా చేస్తుండేవి. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటయ్యాక సుమారు 4లక్షల లారీలు సరుకు రవాణా చేస్తున్నాయి. పెరిగిన డీజిల్, టైర్ల ధరలు, టోల్‌గేట్ చార్జీలు, బీమా, డ్రైవర్ల కమీషన్లు, పోలీసులకు మామూళ్లు, ఫైనాన్సియర్ల వేధింపులకు తోడు రెండు రాష్ట్రాల మధ్య అమలు కాని సింగిల్ పర్మిట్ విధానంతో లారీలు నడపటం ప్రాణసంకటంగా మారిందని యజమానులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

(ఆంధ్రజ్యోతి--కోదాడ)



మోటారు వాహనాల చట్టం ప్రకారం పక్కరాష్ట్రాలకు వెళ్లటానికి సింగల్ పర్మిట్ విధానంలో రూ.5 వేలు చెల్లిస్తే లారీ ఏడాదిలో ఎన్నిసార్లయినా ఆ రాష్ట్రంలోకి గూడ్స్ తీసుకెళ్లి రావచ్చు. కానీ ఉమ్మడి రాష్ట్రం విడిపోయక ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి వెళ్లడానికి ఆ చట్టం అమలుకాకపోవటంతో తాము తీవ్రంగా లారీ యజమానులు నష్టపోతున్నారు. లారీపై రూ.20లక్షల పెట్టుబడి పెడితే సగటున సరాసరి రోజుకు రూ.3 వేలు వచ్చే పరిస్థితి లేదని తెలంగాణ రాష్ట్ర లారీ అసోసియేషన్ చైర్మన్ రామినేని శ్రీనివాసరావు తెలిపారు. గత ఏడాది జనవరి 4న ఇరురాష్ట్రాల సీఎంలను, రాష్ట్ర లారీ ఓనర్స్ అసోసియేషన్ కలిసి సింగిల్ పర్మిట్ విధానాన్ని అమలుచేయాలని విన్నవించామని, ఆలోచిస్తామని చెప్పి నేటికీ అమలు చేయలేదన్నారు. ఇప్పటికైనా సింగిల్ పర్మిట్ విధానాన్ని అమలుచేసి లారీ ఓనర్స్‌ను ఆదుకోండి ప్రభో అంటూ ఇరు రాష్ట్రాల సీఎంలను వేడుకుంటున్నారు.

పర్మిట్ అమలుకాకపోవడంతో..

ఉమ్మడి రాష్ట్రం విడిపోయాక లారీల నిర్వహణ కష్టంగా మారింది. ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి లారీలను పంపించడం తలకు మించిన భారంగా తయారైందని లారీ యజమానులు వాపోతున్నారు. సింగల్ పర్మిట్ విధానం అమలుకాకపోవడం ఇందుకు కారణమంటున్నారు. వారం పర్మిట్‌కు (ఒకసారి వెళ్లిరావటానికి) రూ.2 వేలు, నెలకు రూ.5 వేలు, ఏడాదికి రూ.60వేలు చెల్లించాల్సి వస్తోందన్నారు. దేశంలో ఏ రాష్ట్రంలో ఇటువంటి పరిస్థితి లేదంటున్నారు. నేషనల్ పర్మిట్‌కే ఏడాదికి రూ.17 వేలు ఉందని, అటువంటిది పక్క రాష్ట్రం వెళ్లడానికి రూ.60వేలా అని ప్రశ్నిస్తున్నారు. కర్ణాటక, తమిళనాడు, మహారాష్ట్ర, చత్తీస్‌ఘడ్ వెళ్లటానికి రూ.5 వేలు చెల్లిస్తున్నామని, ఏపీకి వచ్చేటప్పటికీ పూర్తి భిన్నంగా ఉందంటున్నారు. పక్కపక్క రాష్ట్రాలు ఇచ్చుపుచ్చుకొనే ధోరణిలో ఉండకపోవటంతో పన్నుపోటు భరించలేకపోతున్నామని వాపోతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఏపీ ఎపై ఒత్తిడిచేసి సింగిల్ పర్మిట్ విధానం అమలుకు కృషి చేయాలంటున్నారు.

సింగిల్ స్టేట్ పర్మిట్‌తో తగ్గనున్న భారం

కౌంటర్ సిగ్నేచర్ ఫర్ సింగిల్ స్టేట్ పర్మిట్‌కు ప్రభుత్వం అనుమతి ఇస్తే, లారీపై రూ.5 వేల పన్ను కడితే, ఏడాదిలో లారీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ఎన్నిసార్లు అయినా పోయిరావచ్చు. ఇప్పుడు ప్రభుత్వం దానికి అనుమతి ఇవ్వకపోవటంతో నెలకు లారీ యాజమాని రూ.5 వేలు చెల్లించాల్సి వస్తోంది. దీంతో ఏడాదికి అదనంగా రూ.55 వేలు పన్ను చెల్లిస్తున్నారు. ఉమ్మడిరాష్ట్రంలో మద్రాసు వెళ్లినప్పుడు, ప్రభుత్వం ఏవిధానం కొనసాగించిదో ఆ విధానం కొనసాగించాలని ఇరురాష్ట్రాల ప్రభుత్వాలను కోరుతున్నారు.

కోట్లాది మందికి జీవనోపాధి..

రోడ్డు రవాణారంగంలో లారీ యాజమానులు ప్రముఖపాత్ర వహిస్తూ, కోట్లాదిమందికి ప్రత్యక్షంగా, పరోక్షంగానో ఉపాధిని కల్పిస్తున్నారు. కానీ నేడు ఆ యజమానులే గిట్టుబాటు కిరాయిలు లేక రోడ్డున పడే పరిస్థితి నెలకొందని, డ్రైవర్లుగా పనిచేసే స్థితి ఏర్పడిందని వాపోతున్నారు.

ఆర్టీసీ టికెట్ తరహాలో కిరాయి నిర్ణయించాలి

ఫైనాన్స్ సంస్థలు ఇబ్బడిముబ్బడిగా ఇష్టం వచ్చినట్లుగా ఎవరికి పడితే(అర్హతా, అనుభవంలేని) వారికి లారీ ఫైనాన్స్ చేస్తూ ఉన్నాయి. దీంతో రోజుల వ్యవధుల్లో వందలాది లారీలు రోడ్డుపైకి వస్తున్నాయి. ఫలితంగా వాహనదారుల మధ్య తీవ్రపోటీ నెలకొందంటున్నారు. గిట్టుబాటు కిరాయి రాకపోవటం, పన్నుల పోటుతో రవాణా రంగంపై నిజంగా ఆధారపడిన లారీ యాజమానులు నష్టాల ఊబిలోకి వెళుతున్నారని వాపోతున్నారు. ఆర్టీసీ టికెట్ తరహాలో లారీ యజమానులకు కిలోమీటరుకు ఇంత కిరాయి ఇవ్వాలని, ప్రభుత్వమే నిర్ణయిస్తే, లారీ యజమానులు నష్టాల నుంచి బయటపడతారని పేర్కొంటున్నారు.

పెరిగిన పెట్టుబడులు, ఖర్చులు

1994లో 12 టైర్ల లారీపై పెట్టుబడి రూ.4.80 లక్షలు ఉండేది. 12శాతం వడ్డీతో, 20శాతం డౌన్ పేమెంట్‌తో లారీని తీసుకునేవారమని, అదే నేడు లారీకి రూ.22 లక్షల పెట్టుబడి చేయాల్సి వస్తోంది. ఇంకో పక్క పెరుగుతున్న రవాణా ఖర్చులతో లారీలు నడపలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.మరో పక్క ఇన్సూరెన్స్ మూడు రెట్లు పెరిగితే ఇచ్చే క్లయిమ్ మాత్రం అదే తరహాలో పెరగకపోవడంతో ప్రమాదాలు జరిగినప్పుడు తీవ్రంగా నష్టపోవాల్సి వస్తోందంటున్నారు. 15ఏళ్లు దాటిన వాహనాలకు చలానా రూపంలో రూ.15 వేలు చెల్లించాల్సి వస్తోందని వాపోతున్నారు. గతంలో రూ.5వేలు చెల్లించేవారమని చెపుతున్నారు.

పన్నులు భరించలేక పోతున్నాం



రాష్ట్ర విభజన అనంతరం తగ్గాల్సిన పన్నులు తగ్గకపోగా పెరిగాయి. తెలుగు రాష్ట్ర ప్రభుత్వాలు లారీ యజమానుల మేలు దృష్టిలో పెట్టుకుని మోటారు యాక్టు ప్రకారం పన్నులను తగ్గిస్తే మంచిది. లేదంటే వాహనాలు నడపటం కష్టమే.

రామినేని శ్రీనివాసరావు, రాష్ట్ర లారీ ఓనర్స్ అసోసియేషన్ చైర్మన్

సింగిల్ పర్మిట్‌ను అమలుచేయాలి



రెండు రాష్ట్రాల మధ్య సింగిల్‌పర్మిట్ విధానాన్ని అమలుచేస్తే ఒక్కొక్క లారీ యజమానికి ఏడాదిలో రూ.55 వేలు పన్ను భారం తగ్గుతోంది. ఫలితంగా వాహనాలను నడపటం తేలిగ్గా ఉంటుంది. గత ప్రభుత్వం సింగిల్ పర్మిట్‌పై దృష్టి సారించలేదు. ప్రస్తుత ప్రభుత్వం దృష్టి సారించి, సమస్యను పరిష్కరిస్తే లారీ ఓనర్స్ సంతోషపడతారు. ఇప్పటికే కిరాయిలు లేక ఇబ్బందులు ఉంటే, పన్ను పోటుతో మరింత ఇబ్బందులు చూస్తున్నాం.

కనగాల నాగేశ్వరరావు,ఏఎంసీ మెంబర్

రైతులకు షరతులు దుర్మార్గం



విలేకర్లతో మాట్లాడుతున్న జగదీష్‌రెడ్డి

సూర్యాపేట(కలెక్టరేట్), జనవరి 4,(ఆంధ్రజ్యోతి): రైతు భరోసా ఇచ్చేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు షరతులు విధించడం దుర్మార్గమైన చర్య అని మాజీమంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్‌రెడ్డి అన్నారు. సూర్యాపేట జిల్లాకేంద్రంలోని తన క్యాంపు కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికలకు ముందు ప్రజలకు హామీలిచ్చినప్పుడు ఎలాంటి నిబంధనలు పెట్టకుండా.. ఇప్పుడు లేనిపోని కొర్రీలు పెడుతున్నారని దుయ్యబట్టారు. రైతు భరోసా ఎగ్గొటేందుకే షరతులు విధిస్తున్నారని ఆరోపించారు. రైతుల రుణమాఫీ లెక్కలు బయటపెట్టాలని డిమాండ్ చేశారు. కేటీఆర్‌పై పెట్టిన కేసు దేశంలోనే చెత్త కేసు అని మండిపడ్డారు. ప్రధాని మోదీ సహకారంతో సీఎం రేవంత్‌రెడ్డి బీఆర్ఎస్ నాయకులపై కేసులు నమోదు చేయిస్తున్నారని ఆరోపించారు. రైతు భరోసా వందశాతం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఎన్నికల సమయంలో హామీలిచ్చి నేడు మోసం చేస్తున్న వారి భరతం పట్టాలని రైతులకు విజ్ఞప్తి చేశారు. మాజీ సీఎం కేసీఆర్ తెచ్చిన అప్పులకు ఆస్తి కనబడుతోందని, సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం చేసిన రూ.1.28 లక్షల కోట్ల అప్పులతో ఏం చేశారో చెప్పాలన్నారు. అడ్డగోలుగా అప్పులు చేసి ఢిల్లీలోని ఏఐసీసీకి కప్పం కట్టి కాంగ్రెస్ ఎన్నికల కోసం వాడుకుంటున్నారని ఆరోపించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ఇచ్చిన దానికంటే అదనంగా ఇస్తామని చెప్పి అవే ఇవ్వకపోగా, వాటిలోనే కోతపెట్టి కాంగ్రెస్ ప్రభుత్వం దిగజారిందన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ దుర్మార్గాలను ఎండగట్టేందుకు ప్రజలంతా సిద్ధం ఉండాలని పిలుపునిచ్చారు. సమావేశంలో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు బడుగుల లింగయ్యయాదవ్, నాయకులు వై.వెంకటేశ్వర్లు, గోపగాని వెంకటనారాయణగౌడ్, నిమ్మల శ్రీనివాస్‌గౌడ్, పుట్టా కిశోర్‌కుమార్, నెమ్మాది భిక్షం, తూడి నర్సింహ్మారావు, జీడి భిక్షం, బూర బాలసైదులుగౌడ్, బత్తుల ప్రసాద్ తదితరులు ఉన్నారు.



నల్లగొండలో సమావేశంలో పాల్గొన్న బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు రవీంద్రకుమార్, నాయకులు

రైతులు డిక్లరేషన్ ఇవ్వాలనడం శోచనీయం

నల్లగొండ, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): రైతులందరికీ పెట్టుబడి సాయం ఇవ్వలేక ప్రభుత్వం డిక్లరేషన్లు కోరడం శోచనీయమని బీఆర్ఎస్ నల్లగొండ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్ విమర్శించారు. శనివారం నల్లగొండ జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో ఎమ్మెల్సీ మంకెన కోటిరెడ్డి, జడ్పీ మాజీ చైర్మన్ బండా నరేందర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు కంచర్ల భూపాల్‌రెడ్డి, నల్లమోతు భాస్కర్‌రావు, కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి, చిరుమర్తి లింగయ్యతో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రైతుబంధులో పక్కదారి పట్టిందని, రూ.22 వేల కోట్ల మేర దుర్వినియోగం అయ్యాయని తప్పుడు ప్రచారాలు చేస్తూ రైతుభరోసాకి ఎగనామం పెట్టే ప్రయత్నం చేస్తున్నారని దుయ్యబట్టారు. రాష్ట్రంలో ఎలాంటి పరిస్థితులున్నా కేసీఆర్ 75లక్షల మంది రైతులకు రైతుబంధు పేరిట రూ.80వేల కోట్లు అందజేశారని వివరించారు. ప్రజాపాలన దరఖాస్తుల్లోనే రైతుభరోసా లబ్ధిదారులనుంచి దరఖాస్తులు స్వీకరించారని మళ్లీ దరఖాస్తులు డిక్లరేషన్లు ఎందుకని నిలదీశారు. పింఛన్లను రూ.4వేలకు పెంచుతామనే హామీని ఎందుకు అమలుచేయడం లేదన్నారు. ఎన్నికల సమయంలో హామీలిచ్చిన మంత్రి వెంకటరెడ్డి అమలు చేయించలేకపోతే తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. దిక్కుమాలిన పాలనను సీఎం రేవంత్‌రెడ్డి అందిస్తున్నారని దుయ్యబట్టారు. సమావేశంలో సీనియర్ నేతలు సత్తయ్యగౌడ్, మందడి సైదిరెడ్డి, మాలే శరణ్యారెడ్డి, బోనగిరి దేవేందర్, మారగోని గణేశ్, రావుల శ్రీనివాస్‌రెడ్డి, సత్యనారాయణ పాల్గొన్నారు





మాజీ సీఎం కేసీఆర్‌ను హైదరాబాద్‌లో కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుతున్న మాజీ మంత్రి జగదీష్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య, చెర్వుగట్టు ఆలయ మాజీ చైర్మన్ మేకల రాజిరెడ్డి, కొండూరు శంకరయ్య, మాజీ ఎమ్మెల్యే గాదరి కిషోర్ నల్లగొండ జిల్లా గ్రంథాలయాల సంస్థ మాజీ చైర్మన్ రేగట్టె మల్లికార్జున్‌రెడ్డి, (ఆంధ్రజ్యోతి-నార్కట్‌పల్లి, నల్లగొండ)

జిల్లా సహకార కేంద్ర బ్యాంకు అభివృద్ధే లక్ష్యం



సమావేశంలో మాట్లాడుతున్న డీసీసీబీ చైర్మన్ కుంభం శ్రీనివాస్ రెడ్డి

● డీసీసీబీ చైర్మన్ కుంభం శ్రీనివాస్ రెడ్డి

నల్లగొండ, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): జిల్లా సహకార కేంద్ర బ్యాంకు అభివృద్ధే లక్ష్యంగా తమ పాలక ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తుందని డీసీసీబీ చైర్మన్ కుంభం శ్రీనివాస్ రెడ్డి అన్నారు. శనివారం నల్లగొండ జిల్లా కేంద్రంలోని డీసీసీబీ కార్యాలయంలో నాబార్డు పరిశీలన సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 2022-23, 2023-24 ఆర్థిక సంవత్సరాల గురించి ప్రత్యేకంగా బోర్డు కమిటీ మీటింగ్ ఏర్పాటు చేసుకోవడం జరిగిందన్నారు. నాబార్డు ఇన్‌స్పెక్షన్ అధికారులు స్వప్నిల్, ఆదిత్యలు 20రోజులుగా చేసిన పరిశీలనలో అన్నివిధాలుగా సంతృప్తి చెందామని, తమ బ్యాంకు అధికారులు, ఉద్యోగులు పాలకవర్గం పనితీరుకు ఇది నిదర్శనమన్నారు. బ్యాంకు వ్యాపారంతో పాటు ఎన్‌పీఏ తగ్గుదలను, బ్యాంకు లాభాలను నాబార్డు అభినందించడం జరిగిందన్నారు. బ్యాంకు అకౌంటింగ్ అన్నివిధాలుగా నూటికి 99శాతం సక్రమంగా ఉండటం జరిగిందని ఎక్కడైనా చిన్నచిన్న పొరపాట్లు ఉంటే వాటిని తక్షణమే సరిదిద్దుకుని ముందుకు సాగుతామన్నారు. కార్యక్రమంలో డీసీసీబీ వైస్‌చైర్మన్ ఏసిరెడ్డి దయాకర్‌రెడ్డి, డైరెక్టర్లు గొంగిడి మహేందర్‌రెడ్డి, పాశం సంపత్‌రెడ్డి, కొండ సైదయ్య, రంగాచారి, జయరాం, పల్లా ప్రవీణ్ రెడ్డి, కోడి సుష్మ, గుడిపాటి సైదులు, విరిగినేని అంజయ్య, డీసీసీబీ సీఈవో ఆర్.శంకర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

అసభ్యంగా మాట్లాడిన వ్యక్తికి దేహశుద్ధి

కొండమల్లేపల్లి, జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : మహిళతో అసభ్యంగా మాట్లాడిన ఓ వ్యక్తికి దేహశుద్ధి చేశారు. ఈ సంఘటన నల్లగొండ జిల్లా కొండమల్లేపల్లిలో శనివారం రాత్రి మండల కేంద్రంలో జరిగింది. స్థానిక హైదరాబాద్ రోడ్డులో నివాసం ఉండే అబ్దుల్‌రహీం ఎస్‌బీఐ బ్యాంక్ ఎదురుగా ఇడ్లీ బండి నిర్వహిస్తున్న ఓ మహిళతో దాదాపు 10 రోజులుగా అసభ్యంగా మాట్లాడుతున్నాడు. ఇదే విషయం బాధిత మహిళ రహీం కుటుంబానికి చెప్పినప్పటికీ అతడిలో ఎలాంటి మార్పు రాలేదు. దీంతో ఆగ్రహానికి గురైన మహిళ కుటుంబ సభ్యులతో కలిసి ఆ వ్యక్తికి మండల కేంద్రంలో దేహశుద్ధి చేశారు. విషయం సామాజిక మాధ్యమాల్లో వైరల్ కావడంతో యువతి వ్యవహరించిన తీరుపై పట్టణ ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

కారు ఢీకొని బిహార్ వలస కూలీ మృతి



దొరగ సహని(ఫైల్)

వేములపల్లి, జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : రోడ్డు ప్రమాదంలో బిహార్ రాష్ట్రానికి చెందిన వలస కూలీ శుక్రవారం రాత్రి మృతి చెందాడని నల్లగొండ జిల్లా వేములపల్లి ఎస్ఐ వెంకటేశ్వర్లు శనివారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం బిహార్ రాష్ట్రంలోని తూర్పు చంపార జిల్లాకు చెందిన దొరగ సహని(45) తన కుమారుడు ప్రదీప్‌కుమార్ సహనితో కలిసి మూడు నెలల క్రితం శెట్టిపాలెం గ్రామ శివారులోని మహర్షి రైస్‌మిల్లుకు వలస వచ్చి హమాలీగా జీవనం కొనసాగిస్తున్నాడు. కాగా సహని కుమారుడైన ప్రదీప్‌కుమార్ మిల్లు ఎదురుగా నార్కట్‌పల్లి- అద్దంకి రహదారికి అవతల వైపు గల కిరాణ కొట్టు వద్ద కూర్చున్నాడన్నారు. ప్రదీప్‌కుమార్‌ను పిలుచుకొని వచ్చేందుకు మిల్లు నుంచి బయటకు వచ్చి రోడ్డు దాటుతుండగా మిర్యాలగూడ నుంచి నల్లగొండ వైపు వెళ్తున్న ఓ కారు బలంగా ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. శనివారం ఉదయం ప్రదీప్‌కుమార్ సహని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని వారి కుటుంబసభ్యులకు అప్పగించారు. కాగా దొరగ భార్య సునీతాదేవి, ఇద్దరు కుమార్తెలు, మరో కుమారుడు ఉన్నారు.

ట్రాక్టర్ బోల్తా పడి ..

అనంతగిరి, జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : ట్రాక్టర్ కాల్వలో పడిన ఘటనలో ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటన సూర్యాపేట జిల్లా అనంతగిరి మండలంలో శనివారం జరిగింది. అనంతగిరి మండల కేంద్రానికి చెందిన బండి వెంకటనారాయణ(36) వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. శనివారం ఉదయం ట్రాక్టర్‌ను తీసుకొని పొలం కాడికి వెళ్తుండగా ప్రమాదశాత్తు ట్రాక్టర్‌కు కంపమండలు అడ్డురావటంతో, ట్రాక్టర్‌ను తప్పించబోయి పక్కనే ఉన్న మేజర్ కాల్వలో బోల్తాపడింది. ట్రాక్టర్‌పై ఉన్న వెంకటనారాయణ అక్కడికక్కడే మృతిచెందాడు. వెంకటనారాయణకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. భార్య, కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ నవీన్‌కుమార్ తెలిపారు.

అయ్యప్పస్వామి గుడిలో చోరీ

అనంతగిరి, జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : సూర్యాపేట జిల్లా అనంతగిరి మండల కేంద్రంలోని గుట్టపై ఉన్న అయ్యప్పస్వామి దేవాలయంలో చోరీ జరిగినట్లు ఎస్ఐ నవీన్‌కుమార్ తెలిపారు. శుక్రవారం అర్ధరాత్రి హుండీలోని రూ.20 వేలకు పైగా నగదు, బంగారం చోరీ చేశారన్నారు. ఉదయం పూజ చేసేందుకు వెళ్లిన భక్తులు హుండీ పగలకొట్టి ఉండటాన్ని పోలీసులకు సమాచారం అందించారన్నారు. ఆలయ చైర్మన్ కొండపల్లి వాసు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఏడు ఇసుక లారీలు సీజ్

కట్టంగూరు, జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : అక్రమంగా తరలిస్తున్న ఏడు ఇసుక లారీలను శనివారం నల్లగొండ జిల్లా కట్టంగూరు మండలకేంద్రంలో మైనింగ్ విజిలెన్స్, రవాణాశాఖ అధికారులు పట్టుకున్నారు. ఎస్ఐ రవీందర్ తెలిపిన వివరాల ప్రకారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్ల మండల కేంద్రం నుంచి లారీల్లో అధిక లోడుతో ఇసుకను హైదరాబాద్ తరలిస్తున్నారు. నమ్మదగిన సమాచారం మేరకు అధికారులు సంయుక్తంగా కట్టంగూరు గ్రామశివారులో జాతీయ రహదారిపై కాపు కాచి పట్టుకున్నారు. లారీల యజమానులపై కేసు నమోదు చేసి వాహనాలను పోలీస్‌స్టేషన్‌లో అప్పజెప్పినట్లు ఎస్ఐ తెలిపారు.

20 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

కొండమల్లేపల్లి, జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తుండగా శనివారం పట్టుకున్నట్లు నల్లగొండ జిల్లా కొండమల్లేపల్లి ఎస్ఐ రాంమ్మూర్తి తెలిపారు. చందంపేట మండలం పోలెపల్లి గ్రామానికి చెందిన సభావత్ హనుమంతు పెద్దవూర మండలం నుంచి కొనుగోలు చేసి ట్రాలీ ఆటోలో 40 బస్తాలు(20క్వింటాళ్లు) తరలిస్తుండగా చెన్నంనేనిపల్లి సమీపంలో పట్టుకున్నట్లు తెలిపారు. హనుమంత్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

బతుకులు ఛిద్రం

● ప్రీమియర్ ఎక్స్‌ప్లోజివ్స్‌లో భారీ పేలుడు ● ఒకరు మృతి, ముగ్గురికి గాయాలు
● యాదాద్రి భువనగిరి జిల్లా యాదగిరిగుట్ట మండలంలో ఘటన
● నల్లగొండ జిల్లా తిప్పర్తి మండలంలో రోడ్డు ప్రమాదంలో ఇద్దరి దుర్మరణం

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో శనివారం రెండు చోట్ల జరిగిన ప్రమాదాలు పేదల బతుకులను ఛిద్రం చేశాయి. అప్పటి దాకా తమతో కలిసి పనిచేసిన కూలీ మృత్యువాతపడగా, మరికొంత మంది గాయాలపాలై ఆస్పత్రిలో చేరడంతో కూలీలు, వారి కుటుంబ సభ్యులు బోరున విలపించారు. ఈ ఘటనకు యాదాద్రి భువనగిరి జిల్లా యాదగిరిగుట్ట మండలంలోని ప్రీమియర్ ఎక్స్‌ప్లోజివ్స్‌లో జరిగిన పేలుడు కారణమైంది. అదే విధంగా నల్లగొండ జిల్లా తిప్పర్తి మండలంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృత్యువాత పడగా, వారి కుటుంబాలు రోడ్డునపడ్డాయి.

యాదగిరిగుట్ట రూరల్, జనవరి 4(ఆంధ్రజ్యోతి): ప్రీమియర్ ఎక్స్‌ప్లోజివ్స్ కంపెనీలో భారీ పేలుడు జరిగి ఒకరు మృతి చెందగా, మరో ముగ్గురు గాయపడిన ఘటన శనివారం జరిగింది. యాదాద్రి భువనగిరి జిల్లా యాదగిరిగుట్ట మండలంలోని పెద్దకందుకూర్ గ్రామంలోని ప్రీమియర్ ఎక్స్‌ప్లోజివ్స్ కంపెనీలో శనివారం ఉదయం 9.45గంటల ప్రాంతంలో పీఆర్‌డీసీ విభాగం-3లోని (ఎంటీవీ) మెగ్నీషియం, టెప్లాన్, వైటాన్ అనే మూడు రసాయన పదార్థాలు మొత్తం 450 గ్రాములను వెయింగ్ చేస్తున్న (కొలిచే) సందర్భంలో భారీ పేలుడు సంభవించింది. ఈ సమయంలో విధులు నిర్వహిస్తున్న జనగాం జిల్లా బచ్చన్నపేట మండలకేంద్రానికి చెందిన మార్క కనకయ్య(54), యాదగిరిగుట్ట మండలం రామాజీపేట గ్రామానికి చెందిన మొగిలిపాక ప్రకాష్, వగపల్లి గ్రామానికి చెందిన నర్సింహులు, వేణుగోపాల్ తీవ్రంగా గాయపడ్డారు. దీంతో హుటాహుటిన చికిత్స నిమిత్తం వారిని భువనగిరి ఏరియా ఆస్పత్రికి తరలించారు. సమాచారం అందుకున్న స్థానిక పోలీసులు, ఫైర్‌స్టేషన్ అధికారులు హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకొని సహాయక చర్యలు చేపట్టారు. ఎంటీవీ రసాయన పదార్థాలు వెయింగ్ చేస్తుండటంతో గ్యాస్ ఎనర్జీతో పేలుడు సంభవించిందని కంపెనీ ఆపరేషన్ డైరెక్టర్ దుర్గాప్రసాద్ తెలిపారు. ఈ విభాగంలో 16 మంది పనిచేస్తుండగా, 10మంది కార్మికులు భోజనం కోసం బయటికి వచ్చారని, మరో నలుగురు అక్కడే ఉండి విధులు నిర్వహిస్తున్నారని తెలిపారు. ఘటనపై పూర్తి విచారణ అనంతరం ప్రమాదానికి కారణాలు వెల్లడిస్తామని ఆయన చెప్పారు. కాగా, మృతిచెందిన కార్మికుడు కనకయ్యకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. కనకయ్య కుమారుడు వినయ్ హైదరాబాద్‌లో ఉద్యోగం చేస్తున్నాడు. కుమార్తె చంద్రిక లండన్‌లో ఉద్యోగం చేస్తున్నారు. కనకయ్య 30 ఏళ్లగా ఈ కంపెనీలో విధులు నిర్వహిస్తున్నాడు.

కంపెనీలో ఇప్పటివరకు నలుగురి మృత్యువాత

యాదాద్రి భువనగిరి జిల్లా యాదగిరిగుట్ట మండలంలోని పెద్దకందుకూర్ గ్రామంలో ప్రీమియర్ ఎక్స్‌ప్లోజివ్స్ కంపెనీని 1985లో స్థాపించారు. కంపెనీలో 395 కార్మికులు, 80 మంది ఉద్యోగులు, 50 మంది కాంట్రాక్టు కార్మికులు పనిచేస్తున్నారని చెప్పారు. నాటి నుంచి ఇప్పటివరకు పలుమార్లు ప్రమాదాలు జరిగాయి. 2011లో పేలుడు సంభవించినప్పుడు ఇద్దరు కార్మికులు, 2019లో మరో కార్మికుడు, ప్రస్తుత ప్రమాదంలో కనకయ్య అనే కార్మికుడు మొత్తం నలుగురు మృతిచెందారు. దీంతో కొంతవరకు కార్మికుల్లో భయాందోళన మొదలైయింది. కాగా, ఈ కంపెనీ ప్రధానంగా ఎంటీవీని ఉత్పత్తి చేసి భారత రక్షణ దళాలకు దీన్ని సరఫరా చేస్తుంది.



ప్రీమియర్ ఎక్స్‌ప్లోజివ్స్ కంపెనీ

పేలుళ్లలో గాయపడిన కార్మికుడు

తిప్పర్తి మండలంలో జరిగిన ప్రమాదంలో దెబ్బతిన్న కారు



చర్యలు తీసుకుంటాం : ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య

కంపెనీ యాజమాన్యంపై చర్యలు తీసుకుంటామని ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య అన్నారు. శనివారం విషయం తెలుసుకున్న ఆయన ఘటనా స్థలానికి చేరుకొని కంపెనీ డైరెక్టర్ దుర్గాప్రసాద్‌ను వివరాలు అడిగి తెలుసుకున్నారు. దేశంలోనే రెండో స్థానంలో ఉన్న కంపెనీ కేవలం లాభాలకోసం చూస్తుందే తప్ప కార్మికుల భద్రతను పట్టించుకోకపోవడం సరికాదన్నారు. అనంతరం భువనగిరిలో చికిత్స పొందుతున్న కార్మికులను ఆయన పరామర్శించారు.

సంఘటనా స్థలాన్ని పరిశీలించిన అధికారులు

ప్రీమియర్ ఎక్స్‌ప్లోజివ్స్ కంపెనీలో పేలుడు సంభవించిన విషయం తెలుసుకున్న స్థానిక ఏసీపీ రమేష్‌కుమార్ ఘటనాస్థలానికి చేరుకొని వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట సీఐ రమేష్, డీఎఫ్‌వో మధుసూధన్ రావు తదితరులు ఉన్నారు.

కంపెనీ యాజమాన్యంపై కేసు నమోదు

యాదగిరిగుట్ట మండలంలోని పెద్దకందుకూర్ గ్రామంలో శనివారం జరిగిన పేలుడు ఘటనలో మృతి చెందిన కార్మికుడు కనకయ్య భార్య కవిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ రమేష్ తెలిపారు.

కనకయ్య కుటుంబానికి ఎక్స్‌గ్రేషియో

యాదగిరిగుట్ట మండలంలోని పెద్దకందుకూర్ ప్రీమియర్ ఎక్స్‌ప్లోజివ్స్ కంపెనీలో పేలుడు ఘటనలో మృతిచెందిన కనకయ్య కుటుంబానికి కంపెనీ యాజమాన్యం రూ.60లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించిందని కంపెనీ గుర్తింపు యూనియన్ టీఆర్‌ఎస్‌కేవీ అధ్యక్షుడు గొంగిడి మహేందర్‌రెడ్డి తెలిపారు. శనివారం యాజమాన్యం, కార్మిక సంఘాల నాయకులతో కలిసి చర్చించినట్లు తెలిపారు. ఎక్స్‌గ్రేషియోతోపాటు కనకయ్య భార్యకు ఉద్యోగం ఇచ్చేందుకు ఒప్పుకున్నట్లు వివరించారు.

యాజమాన్యం తగిన సహాయం చేయాలి : గొంగిడి సునీత

కంపెనీలో జరిగిన ఘటనా స్థలాన్ని మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీతామహేందర్ రెడ్డి సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ యాజమాన్యం కార్మికుల కుటుంబాలకు న్యాయం చేయలన్నారు.



క్షతగాత్రులను పరామర్శిస్తున్న సునీత



భువనగిరి ఆస్పత్రిలో రోదిస్తున్న క్షతగాత్రుల కుటుంబ సభ్యులు

బైక్‌ను ఢీ కొట్టిన కారు

ద్విచక్రవాహనదారుడితోపాటు కారులో ప్రయాణిస్తున్న మహిళ మృతి

తిప్పర్తి, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనాన్ని కారు ఢీ కొట్టిన ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు అక్కడికక్కడే మృతి చెందారు. ఈ ప్రమాదం నల్లగొండ జిల్లా తిప్పర్తి మండల పరిధిలోని డబుల్ బెడ్‌రూం ఇళ్ల సమీపంలో శనివారం ఉదయం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... దామరచర్ల మండలం దిలావర్‌పూర్ గ్రామానికి చెందిన గంధం శ్రీనివాస్(35) తన కుటుంబంతో కలిసి నల్లగొండ పట్టణ సమీపంలోని హ్యాపీ హోమ్స్ కాలనీలో నివాసం ఉంటున్నాడు. శనివారం ఉదయం తన వ్యక్తిగత పనుల నిమిత్తం ఇంటి నుంచి తిప్పర్తి వైపునకు ద్విచక్ర వాహనంపై వెళ్తున్నాడు. గుంటూరు జిల్లా కేంద్రానికి చెందిన కొండసాని సునీల్ భార్య శిరీష (39) తన ఆరోగ్య చికిత్స నిమిత్తం హైదరాబాద్‌కు తన స్నేహితురాలు రూపూడి రాణితో కలిసి ఓ ప్రైవేట్ కారులో వెళ్లారు. చికిత్స అనంతరం శనివారం ఉదయం గుంటూరు బయలుదేరారు. ఈ క్రమంలో తిప్పర్తి సమీపంలోకి రాగానే డ్రైవర్ అతివేగంగా వాహనం నడుపుతూ పక్కన వెళ్తున్న ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టాడు. దీంతోపాటు కారు అదుపుతప్పి చెట్టును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ద్విచక్ర వాహనంపై ఉన్న శ్రీనివాస్‌కు బలమైన గాయాలవడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. కారులో ముందు సీటులో కూర్చున్న శిరీష కూడా కారు అద్దానికి ఢీకొని కారులో నుంచి రోడ్డు పక్కన ఉన్న పంట పొలంలో పడిపోయింది. తీవ్రంగా గాయపడిన ఆమె కూడా అక్కడికక్కడే మృతి చెందింది. అదే విధంగా డ్రైవర్ టంగుటూరి సందీప్ కారులోనే ఇరుక్కొని కాలు విరగ్గా, కారు వెనక సీటులో కూర్చున్న రాణికి కూడా తీవ్రగాయాలతో పాటు ఒక కాలు విరిగింది. మృతుడు గంధం శ్రీనివాస్‌కు భార్యతో పాటు ఒక పాప, బాబు ఉన్నారు. అతడి భార్య గంధం జ్యోతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సాయిప్రశాంత్ తెలిపారు. కారులో ప్రయాణించిన మృతురాలు శిరీషకు భర్తతో పాటు ఒక పాప, బాబు ఉన్నారు.

ఆస్పత్రుల్లో ఆర్తనాదాలు

భువనగిరి టౌన్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): యాదగిరిగుట్ట మండలం పెద్దకందుకూరులోని ప్రీమియర్ ఎక్స్‌ప్లోజివ్స్‌లో జరిగిన పేలుళ్లతో భువనగిరి ఆసుపత్రులు ఆర్తనాదాలతో విలవిల్లాడాయి. సంఘటనా స్థలంలోనే మృతి చెందిన కనకయ్య మృతదేహాన్ని జిల్లా ఆసుపత్రికి తరలించగా తీవ్రంగా గాయపడిన మొగిలిపాక ప్రకాశ్‌కు ప్రాథమిక చికిత్సలు అందించిన అనంతరం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. అలాగే ఈ ఘటనలో స్వల్పంగా గాయపడిన 40మందికి పైగా కార్మికులకు ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స అందించారు. అయితే వీరిలో పలువురు డిశ్చార్జీ కాగా మరికొందరూ ఆసుపత్రిలోనే ఉన్నారు. కనకయ్య కుటుంబ సభ్యులతో, గాయపడిన కార్మికుల కుటుంబ సభ్యుల రోదనలు జిల్లా ఆసుపత్రి, ప్రైవేట్ ఆసుపత్రుల్లో మిన్నంటాయి. పలువురు కార్మికులు నల్ల బ్యాడ్జీలు ధరించి ఆసుపత్రుల వద్ద విషాద వదనాలతో బాధిత కుటుంబ సభ్యులను ఓదార్చారు. ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య, మాజీ టెస్కాబ్ వైస్‌చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డి తదితరులు రెండు ఆసుపత్రులను సందర్శించి బాధితులను పరామర్శించారు. రెండు ఆసుపత్రుల వద్ద పట్టణ పోలీసులు ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేశారు. కుటుంబ సభ్యుల నిరసనలతో కనకయ్య మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించలేదు. మార్చురీలో భద్రపరిచిన మృతదేహానికి ఆదివారం పోస్టుమార్టం నిర్వహిస్తామని ఆసుపత్రి వర్గాలు పేర్కొన్నాయి. ఎక్స్‌ప్లోజివ్స్‌లో పేలుళ్లు సర్వ సాధారణమయ్యాయని, ముందు జాగ్రత్తలు తీసుకోవడంలో యాజమాన్యం చూపుతున్న అలసత్వం కారణంగా కార్మికుల ప్రాణాలు గాల్లో కలుస్తున్నాయని పలువురు ఆవేదన వ్యక్తం చేశారు.

మళ్లీ గ్రామస్థాయిలో
రెవెన్యూ అధికారి

(5వపేజీ తరువాయి)

నిర్వహించడం, విద్యార్థులకు ఆదాయ, కుల ధ్రువీకరణ పత్రాలివ్వడం, నివాస ధ్రువపత్రాలివ్వడం వరకు అదేవిధంగా అధికారులు, ప్రజాప్రతినిధు ల పర్యటనల సందర్భంగా గ్రామంలో ముందస్తు సమాచారం ఇవ్వడం, ఆయా పర్యటనల్లో వారికి సహాయకారిగా ఉండడం వరకు అనేక కీలకమైన విధులను వీఆర్‌వోలు నిర్వహించేవారు. అయితే ఈ వ్యవస్థ 1984నుంచి రాష్ట్రంలో కుదుపులకు లోనవుతూ వస్తోంది. పటేల్, పట్వారీ వ్యవస్థ రద్దులో భాగంగా 1984లో మొదటిసారి రద్దయింది. ఆతర్వాత 1985లో వీఏవోలను నియమించారు. తదుపరి 1992లో మళ్లీ రెవెన్యూ బాధ్యతలతో విలేజ్ అడ్మినిస్ట్రేటివ్ అధికారిని నియమించారు. 2002లో మళ్లీ వీఏవోలను రద్దుచేసి పంచాయతీ కార్యదర్శులను నియమించారు. ఆతర్వాత తిరిగి 2007లో పంచాయతీ కార్యదర్శుల నుంచి రెవెన్యూను విడదీసి మళ్లీ వీఆర్‌వో వ్యవస్థను ఏర్పాటు చేశారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు తర్వాత 2022లో మళ్లీ వీఆర్వో వ్యవస్థను రద్దు చేశారు. తిరిగి తాజాగా, గ్రామస్థాయి పాలనాధికారి (రెవెన్యూ)ని ప్రవేశపెడుతున్నారు. ఈసారైనా పక్కాగా పొరపాట్లకు ఆస్కారం లేకుండా బలీయమైన వ్యవస్థగా ఏర్పాటు చేయాలని, అవినీతి, అక్రమాలకు పాల్పడితే సర్వీస్ నుంచి రిమూవ్ చేసేలా జీవోకూడా ఇవ్వాలని పలువురు పూర్వ వీఆర్వోలు సూచిస్తున్నారు.

వీఆర్ఏల వారసులకు ఉద్యోగాలివ్వాలనే డిమాండ్

వీఆర్ఏలకు (గ్రామ రెవెన్యూ సహాయకులు) 61 ఏళ్లు నిండిన వారి వారసులకు అర్హతలకు అనుగుణంగా ఉద్యోగాలివ్వాలనే డిమాండ్ వీఆర్ఏల నుంచి వస్తోంది. వారసత్వ ఉద్యోగాల కింద గ్రామసహాయకులు దశాబ్దాలుగా పనిచేస్తున్నారు. 2020లో సమ్మె సందర్భంగా అప్పటి సీఎం వీఆర్ఏలకు పేస్కేల్‌తో పాటు, వారసులకు ఉద్యోగాలిస్తామని ప్రకటించారు. అందుకోసం జీవో 85కూడా విడుదల చేశారు. ఆతర్వాత కాలంలో ఆ వ్యవస్థ రద్దవడం, వేరే శాఖలకు బదలాయించడంతో చెల్లాచెదురైన వీఆర్ఏలు వారి డిమాండ్లను బలంగా వినిపించలేకపోయారు. తాజాగా, మళ్లీ రెవెన్యూ వ్యవస్థలోకి తీసుకుంటున్న నేపథ్యంలో జీవో 85 అమలు చేయాలని కోరుతున్నారు. వారసులకు అర్హతల ప్రాతిపదికన వీఆర్వో నుంచి సీనియర్ అసిస్టెంట్ వరకు నియమించాలని కోరుతున్నారు. ఇప్పటికే రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, పంచాయతీరాజ్‌శాఖ మంత్రి ధనసరి సీతక్కను సైతం కలిసి ఈమేరకు విన్నవించారు. వీఆర్ఏల డిమాండ్‌ను సానుకూలంగా పరిష్కరించి వారసులకు ఉద్యోగాలివ్వాలని కోరుతున్నారు. ఉమ్మడి జిల్లాలో 341 మంది వారసత్వ వీఆర్ఏలు విధులు నిర్వర్తిస్తుండగా, ఈ జీవో అమలైతే వీరికి పెద్ద ఉపశమనం కలగనుంది.



గ్రామాధికారి ప్రభుత్వానికి వెన్నుముక

గ్రామ పాలనాధికారి వ్యవస్థను పునరుద్ధరిస్తూ, వీఆర్వోలను తిరిగి ఆ పోస్టుల్లో నియమించేందుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం సంతోషదాయకం. గ్రామాధికారిగా వ్యవహరించే వీఆర్వోలే ప్రభుత్వానికి వెన్నుముక. గ్రామంలో అన్నింటికీ జవాబుదారీగా ఉండే ఈ అధికారి వ్యవస్థను రద్దుచేస్తే పాలనాపరంగా చాలా ఇబ్బందులు ఎదురవుతుంటా యి. వీటిని అనుభవంలోకి తీసుకున్నాకే ప్రభుత్వం మళ్లీ ఈ వ్యవస్థని ప్రవేశపెడుతోంది. ఉద్యోగుల్లో జవాబుదారీతనం పెంచేందుకు, అవినీతికి పాల్పడకుండా ఉండేందుకు కఠినమైన శిక్షలుండేలా చూడాలే తప్ప వ్యవస్థను రద్దు చేయడం సరికాదు. పునరుద్ధరణ ద్వారా రైతులకు, గ్రామస్థులకే కాదు అధికారులకు సైతం ఉపయుక్తంగా ఉంటుంది.

చాంద్‌పాషా, నల్లగొండ జిల్లా వీఆర్వోల సంఘం మాజీ ప్రధాన కార్యదర్శి

హామీలు నెరవేర్చడంలో విఫలం

మాజీ ఎంపీ బూర నర్సయ్య గౌడ్

రామగిరి, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సందర్భంగా అనేక హామీలు ఇచ్చిన వాటిని నేరవేర్చడంతో విఫలమైందని, పథకాలు అమలు చేయకుండా కేవలం ప్రచారానికే పరిమితం అయ్యారు. మాజీ ఎంపి బూర నర్సయ్య గౌడ్ తెలిపారు. శనివారం నల్లగొండ పట్టణంలోని బీజేపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రైతు భరోసా అమలుపై మంత్రులు రోజుకో ప్రకటన చేస్తున్నారన్నారు. రుణమాఫీ ఎగ్గొటినట్టుగానే రైతు భరోసాకు ఎగనామం పెట్టేందుకు షరతులు పెట్టేందుకు ప్రయత్నిస్తుందన్నారు. రీజినల్‌రింగ్ రోడ్డు భూసేకరణ విషయంలో మంత్రి కోమటిరెడ్డి స్పష్టత లేకుండా మాట్లాడుతున్నారని తెలిపారు. సమావేశంలో నాగం వర్షిత్‌రెడ్డి, మాదగాని శ్రీనివాస్‌గౌడ్, యెరెడ్ల శ్రీనివాస్‌రెడ్డి, లాలూనాయక్, రామరాజుయాదవ్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నర్సయ్యగౌడ్

విద్యార్థుల సృజనాత్మకతను వెలికితీయాలి

● **శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి**

నల్లగొండ, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల సృజనాత్మకతను వెలికితీసి వారి ఆలోచన విధానాన్ని పెంపొందించే విధంగా ఉపాధ్యాయులు కృషి చేయాలని శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి పిలుపునిచ్చారు. శనివారం నల్లగొండ జిల్లాకేంద్రంలోని ఎస్ఎల్‌బీసీ వద్ద ఉన్న డాన్‌బోస్కో ఉన్నత పాఠశాలలో రెండు రోజులపాటు నిర్వహించిన జిల్లాస్థాయి విద్యా వైజ్ఞానిక ప్రదర్శన, సైన్స్, గణిత, పర్యావరణ ప్రదర్శన ముగింపు కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై రాష్ట్ర స్థాయికి ఎంపికైన ప్రదర్శనలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో చైర్మన్ మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల్లో సైన్స్‌కు పోటీ పెరుగుతుందన్నారు. సైన్స్ ఆధారంగానే జీవన విధానం మారుతుందని, ఆధునిక వ్యవసాయ రంగంలో సైన్స్‌ది కీలకపాత్ర అని, అలాగే ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వల్ల ప్రపంచవ్యాప్తంగా పోటీ పెరుగుతున్నదన్నారు. వ్యవసాయ రంగంలో మానవ వనరులను తగ్గిస్తూ గిట్టుబాటు ధరలు ఏవిధంగా సాధించాలో రైతులు అవలంబిస్తున్నారని, గతంలో వ్యవసాయం చేయడం కష్టంగా ఉండేదని, శాస్త్రవేత్తలు వివిధ రకాల యంత్ర పరికరాలు, పనిముట్లు కనుక్కోవడంవల్ల ప్రస్తుతం వ్యవసాయం చాలా సులభమైందన్నారు. జిల్లాస్థాయిలో నిర్వహించిన విద్యా వైజ్ఞానిక ప్రదర్శనలో 236 ప్రాజెక్టులను 200 మంది విద్యార్థులు సందర్శించడం అభినందనీయమన్నారు. భవిష్యత్ శాస్త్రవేత్తలను తయారు చేయడంలో ఉపాధ్యాయుల కృషి ఎంతో ఉందని, విద్యార్థుల సృజనాత్మకతను, నైపుణ్యాలను వెలికితీసి వారిని శాస్త్రవేత్తలుగా తీర్చిదిద్దాలని, విద్యార్థుల ఆలోచన విధానాన్ని పెంపొందించేలా కృషి చేయాలని పిలుపునిచ్చారు.



బహుమతి ప్రదానం చేస్తున్న గుత్తా సుఖేందర్‌రెడ్డి

విద్యకు అత్యంత ప్రాధాన్యం

రాష్ట్ర ప్రభుత్వం విద్యకు అత్యంత ప్రాధాన్యమిస్తోందని, ఇందులో భాగంగా బడ్జెట్లో రూ.21వేల కోట్లు కేటాయించిందని గుత్తా సుఖేందర్‌రెడ్డి అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 28 నియోజకవర్గాల్లో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్లు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 18లక్షల 20వేల మంది విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్నారని, 26వేల పాఠశాలలున్నాయని, 6000 పాఠశాలలు మూతపడే పరిస్థితిలో ఉన్నాయన్నారు. గురుకులాల్లో ఆరు లక్షల మంది విద్యార్థులు ఉన్నారని, డ్రాపవుట్లను తగ్గించి విద్యార్థుల సంఖ్యను పెంపొందించడంపై విద్యాశాఖ అధికారులు దృష్టి సారించాలన్నారు. జిల్లా పరిషత్ సీఈవో ప్రేమ్ కరణ్‌రెడ్డి, ప్రదీప్ ఫౌండేషన్ సీఈవో గోనారెడ్డి, జిల్లా విద్యాశాఖ అధికారి భిక్షపతి మాట్లాడారు. కార్యక్రమంలో మునిసిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ లక్ష్మయ్య, డాన్ బోస్కో స్కూల్ ప్రిన్సిపల్ బాలశౌరి రెడ్డి, గుమ్మలమోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక చింతన అవసరం

● **గరికపాటి నరసింహారావు**



భూదాన్ పోచంపల్లి, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): ప్రతీ ఒక్కరికి ఆధ్యాత్మిక చింతన అవసరమని ప్రవచనకర్త గరికపాటి నరసింహారావు అన్నారు. భూదానపోచంపల్లిలో శనివారం మార్కండేయ స్వామి దేవాలయం ఆవరణలో పాండురంగ స్వామి భజన మండలి స్వర్ణోత్సవాల్లో పాల్గొని మాట్లాడారు. భక్తి భావనతోనే ఆధ్యాత్మిక భావాలు ప్రపంచానికి వెదజల్లబడుతున్నాయన్నారు. అంతకుముందు ఉభయ తెలుగు రాష్ట్రాల స్థాయి భజన సంకీర్తన పోటీలను మునిసిపల్ చైర్మన్ విజయలక్ష్మి శ్రీనివాస్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు తడక వెంకటేశ్వర్లు ప్రారంభించారు. కార్యక్రమంలో మార్కండేయ స్వామి దేవాలయం చైర్మన్ డాక్టర్ సీత సత్యనారాయణ, నాయకులు భోగ స్వామి, భజన మండలి ఉపాధ్యక్షులు భారత వెంకటేశం, ప్రధాన కార్యదర్శి పుప్పాల నాగేశ్వర్, సహాయ కార్యదర్శి దోర్నాల శ్రీనాథ్, కోశాధికారి కొంగరి పండరినాథ్ పాల్గొన్నారు.

మహా కుంభాభిషేకానికి సీఎంకు ఆహ్వానం

భువనగిరి అర్బన్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): యాదగిరిగుట్ట లక్ష్మీ నరసింహ స్వామివారి దివ్య విమాన రాజగోపురం మహా కుంభాభిషేక మహోత్సవానికి రావాలని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డికి ఆహ్వానపత్రిక అందజేశారు. శనివారం హైదరాబాద్‌లోని సచివాలయంలో సీఎంను దేవాదాయ మంత్రి కొండ సురేఖ, ప్రిన్సిపల్ సెక్రెటరీ శైలజా రామయ్యర్, కమిషనర్ ఎస్.శ్రీధర్ సమక్షంలో ఆలయ ఈవో ఏ.భాస్కర్‌రావు అర్చకబృందంతో కలిసి స్వామివారి శేష వస్త్రం కప్పి లడ్డు ప్రసాదం అందజేశారు. ఈ ఏడాది ఫిబ్రవరి 20 వరకు విమాన గోపురం బంగారు తాపడం పనులు పూర్తి చేయాలని ఆలయ అధికారులు సంకల్పించారు. ఈ తరుణంలో ఫిబ్రవరి 19 నుంచి 23వరకు మహాకుంభాభిషేకం నిర్వహించేందుకు నిర్ణయించి, సీఎంను ఆహ్వానించినట్టు ఈవో తెలిపారు. సీఎంను కలిసిన వారిలో ప్రధానార్చకులు నల్లంథీఘళ్ లక్ష్మీనరసింహచార్యులు, కాండూరి వెంకటాచార్యులు, సిద్ధాంతి గౌరీభట్ల సత్యనారాయణశర్మ, భట్టర్ సురేంద్రాచార్యులు ఉన్నారు.



సీఎం రేవంత్‌రెడ్డిని ఆహ్వానిస్తున్న ప్రధాన అర్చకులు

యాదగిరీశుడికి శాస్త్రోక్తంగా నిత్య పూజలు



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

భువనగిరి అర్బన్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): యాదగిరిగుట్ట లక్ష్మీ నరసింహ స్వామి వారి దివ్యక్షేత్రంలో శనివారం శాస్త్రోక్తంగా నిత్య పూజలు జరిగాయి. సుప్రభాత సేవతో స్వయంభువులను మేల్కొలిపిన అర్చకులు గర్భగుడిలో కొలువుదీరిన స్వయంభువులను, సువర్ణ ప్రతిష్ఠామూర్తులను వేదమంత్రోచ్చరణలు, మంగళ వాయిద్యాల నడుమ పంచామృతాలతో అభిషేకించి తులసీ దళాలతో అర్చించారు. ప్రాకార మండపంలో సుదర్శన హోమం, నిత్య కల్యాణోత్సవం ఆగమశాస్త్రరీతిలో వైభవంగా చేపట్టారు. అష్టభుజి ప్రాకార మండపంలో స్వామి అమ్మవారలను ముగ్ధమనోహరంగా అలంకరించి ప్రత్యేక వేదికపై తీర్చిదిద్ది సుదర్శన శతక పఠనాలతో హవనం నిర్వహించారు. అనంతరం గజవాహన సేవలో ఊరేగించి విశ్వక్సేనుడి తొలిపూజలతో నిత్య తిరుకల్యాణోత్సవం ఆగమశాస్త్రరీతిలో చేపట్టారు. సాయంత్రం ప్రధానాలయ ముఖమండపంలో దర్బారు సేవోత్సవం చేపట్టిన ఆచార్యులు సాయంత్రం అలంకార వెండి జోడు సేవలు, సహస్రనామార్చనలు చేశారు. పాతగుట్ట ఆలయంలో నిత్య కైంకర్యాలు వేద మంత్రాలు మంగళవాయిద్యాల నడుమ వైభవంగా నిర్వహించిన అర్చకులు సాయంత్రం వెండి జోడు సేవలు, సహస్రనామార్చనలు నిర్వహించారు. శివాలయంలో పర్వతవర్ధిని సమేత రామలింగేశ్వరస్వామికి, మహామండపంలో స్ఫటికమూర్తులకు నిత్యారాధనలు, యాగశాలలో నిత్య రుద్రహవన పూజలు శైవాగమ పద్ధతిలో కొనసాగాయి. ఆలయ ఖజానాకు వివిధ విభాగాల ద్వారా రూ.28,78,126 ఆదాయం సమకూరినట్టు ఈవో ఏ.భాస్కర్ రావు తెలిపారు. కాగా, ఆలయంలో ధనుర్మాసోత్సవాలు శనివారంతో 20వ రోజుకు చేరాయి.

మఠంపల్లి: మట్టపల్లి లక్ష్మీనరసింహుడి క్షేత్రంలో స్వామివారి నిత్య కల్యాణాన్ని వేదపండితులు శనివారం వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త చెన్నూరి విజయ్‌కుమార్, మట్టపల్లిరావు, ఈవో సిరికొండ నవీన్, అర్చకులు తూమాటిశ్రీనివాసాచార్యులు, పద్మనాభాచార్యులు పాల్గొన్నారు.

డ్రైనేజీ సమస్యను రూపుమాపేందుకు చర్యలు

నల్లగొండ పట్టణంలో నెలకొన్న అండర్ గ్రౌండ్ డ్రైనేజీ సమస్యను పరిష్కరించేందుకు తగిన చర్యలు తీసుకుంటున్నట్లు మునిసిపల్ కమిషనర్ సయ్యద్ ముసాబ్ అహ్మద్ తెలిపారు. అందులో భాగంగా రూ. 216 కోట్లతో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణ పనులు ప్రారంభించినట్లు తెలిపారు. ఇప్పటికే పలు వార్డుల్లో పనులు ప్రారంభమయ్యాయి. నిర్ణీత వ్యవధిలోపు అన్ని వార్డుల్లో పనులను పూర్తి చేయనున్నట్లు పేర్కొన్నారు. అదేవిధంగా పట్టణంలో నెలకొన్న సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించేందుకు తగిన చర్యలు తీసుకుంటున్నట్లు ఆయన తెలిపారు. శనివారం ఆంధ్రజ్యోతి నిర్వహించిన ఫోన్ ఇన్ కార్యక్రమంలో భాగంగా కమిషనర్ పట్టణ ప్రజలు అడిగిన సమస్యలకు సమాధానమిచ్చారు.

- (ఆంధ్రజ్యోతి, నల్లగొండటౌన్)



మునిసిపల్ కమిషనర్ సయ్యద్ ముసాబ్ అహ్మద్

రోడ్లన్నీ అస్తవ్యస్తంగా మారాయి
- శ్రీనివాస్ రెడ్డి, 19 వార్డు

ఇటీవల తమ కాలనీలో రోడ్లను తవ్వారు. అయితే రోడ్లను పూడ్చడంలో నిర్లక్ష్యం కారణంగా రోడ్లన్నీ అస్తవ్యస్తంగా మారి ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుంది.

కమిషనర్: సంబంధిత డీఈని పంపించి చర్యలు తీసుకుంటాం.

డ్రైనేజీలు పేరుకు పోతున్నాయి
- యాదగిరి, మూడో వార్డు, పానగల్

పానగల్‌లోని అంజయ్య చికెన్ సెంటర్ ఎదురుగా మోరీలు సరిగా తీయకపోవడంతో చెత్తాచెదారం అంతా పేరుకుపోతుంది. దీనికి తోడు పందులు బెడద కూడా తీవ్రంగా ఉంది.

- ముజీబ్, 27వ వార్డు

మా వార్డులోని మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ వెనుకగల మోరీలన్నీ తరచూ జామవుతున్నాయి.

కమిషనర్: సోమవారంలోగా సంబంధిత సిబ్బందిని పంపించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం.

వీధిలైట్లు వెలగడం లేదు
- రామకృష్ణ, 19వ వార్డు

మా ఇంటి వద్ద కొన్ని రోజులుగా వీధి లైట్లు వెలగడం లేదు. మేముండే ప్రాంతం శివారు కావడంతో రాత్రి పూట ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం.

కమిషనర్ : ఎలక్ట్రిషన్‌ని పంపించి తగిన చర్యలు తీసుకుంటాం, అవసరమైతే విద్యుత్ పోల్స్‌ను ఏర్పాటు చేస్తాం.

ఓపెన్ జిమ్‌ల నిర్వహణ చేపట్టాలి
- రావుల శ్రీనివాస్‌రెడ్డి, మాజీ కౌన్సిలర్.

పట్టణంలో ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్‌ల నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. ఫలితంగా జిమ్ములన్నీ నిరుపయోగంగా మారే అవకాశం ఉంది. అదేవిధంగా వీటీ కాలనీలోని దేవాలయంలో ఏర్పాటు చేసిన మొక్కలు పరిరక్షించాలి. పట్టణంలోని మహనీయుల విగ్రహాలకు ఫ్లెక్సీలను కట్టకుండా నిషేధించాలి.

కమిషనర్: జిమ్‌ల విషయంలో సంబంధిత కాలనీలో వాసులతో సమావేశాలు ఏర్పాటు చేసి నిర్వహణపై తగిన చర్యలు తీసుకుంటాం. అదే విధంగా దేవాలయంలో ఏర్పాటు చేసిన పార్కులో మొక్కలను పర్యవేక్షించేందుకు వాచ్‌మన్ ఏర్పాటు చేశాం.

డ్రైనేజీని నిర్మించాలి
- మహేష్, పానగల్

పానగల్‌లోని రెండు, మూడు వార్డుల్లో బుర్రి ఎల్లమ్మ టెంపుల్ వద్ద విస్తరించిన మురికికాల్వ ఎంతో పురాతనమైనది. ఈ కాల్వ రెండు వార్డుల పరిధిలో ఉన్నందున ఎవరూ పట్టించుకోవడం లేదు. దీంతో ఆ ప్రాంత వాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుంది.

కమిషనర్ : సిబ్బందిని పంపించి చర్యలు తీసుకుంటాం.

పారిశుధ్య నిర్వహణ సరిగా లేదు
- భజరంగ్ ప్రసాద్, 27వ వార్డు

మా వార్డు పొట్టిగడ్డలో పారిశుధ్య నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. ముఖ్యంగా పిచ్చిచెట్లు పెరిగి దోమలకు నిలయాలుగా మారాయి. అదే విధంగా సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా డ్రైనేజీల్లో చెత్తాచెదారం పేరుకుపోతుంది.

కమిషనర్: జవాన్‌ను పంపించి చర్యలు తీసుకుంటాం.

ఇంటి నెంబర్లు కేటాయించాలి
చంద్రశేఖర్, పానగల్

పానగల్ మూడో వార్డు పరిధిలో అనేక ఇళ్లకు ఇంటి నెంబర్లు కూడా లేవు. ఇళ్లకు డాక్యుమెంట్లు లేకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. నెంబర్లను కేటాయించాలి.

కమిషనర్: పరిశీలించి ఓనర్ ఆఫ్ ప్రాపర్టీ ఇస్తాం.

కోతుల బెడద తీవ్రంగా ఉంది
- దామోదర్‌రెడ్డి, సాయిద్వారకాపురి కాలనీ, చర్లపల్లి

మా కాలనీలో కోతులు బెడద తీవ్రంగా ఉంది. రెండు నెలల క్రితం వచ్చి కోతులు పట్టుకెళ్లారు. కానీ తిరిగి మళ్లీ వస్తున్నాయి.

కమిషనర్: కోతులను పట్టేవారిని ఆంధ్ర ప్రాంతం నుంచి పిలవాల్సి ఉంటుంది. మరోసారి వారిని తీసుకువచ్చి సమస్యను పరిష్కరిస్తాం.

ఇబ్బందులకు గురి చేస్తున్నారు
- అజయ్, హనుమాన్‌నగర్

మేమంతా ఇటీవల కాలంలో ఇళ్ల నిర్మాణం చేసుకున్నాం. అందరం కూడా సెట్ బ్యాంక్ తీసుకున్నాం. అయితే కొందరు మాత్రం రోడ్లపైకి నిర్మాణాలు తెచ్చి ఇబ్బందులకు గురి చేస్తున్నారు.

కమిషనర్: స్వయంగా ఆ ప్రాంతాన్ని నేనే విజిట్ చేస్తాను.

సిబ్బంది రావడం లేదు
కసిరెడ్డి శేఖర్‌రెడ్డి, 15వ వార్డు

మా కాలనీలో ఎక్కడ చెత్త అక్కడ పేరుకుపోయింది. పారిశుధ్య కార్మికులు ఎక్కడ కూడా కనిపించడం లేదు. వీధి లైట్లు కూడా సరిగా పనిచేయడం లేదు.

కమిషనర్ : తప్పకుండా పరిశీలిస్తాం.

దుర్గంధాన్ని వెదజల్లుతున్నాయి
శివ, సుందరయ్య కాలనీ

కొందరు వ్యక్తులు కోళ్ల ఫామ్ షెడ్లను లీజుకు తీసుకొని వ్యర్థాలను డంపింగ్ చేస్తున్నారు. దీంతో ఆ ప్రాంతమంతా దుర్గంధం వెదజల్లుతుంది. ఫలితంగా తాము ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం.

కమిషనర్: వెంటనే శానిటరీ ఇన్‌స్పెక్టర్‌ను పంపిస్తాను.

డ్రైనేజీ లేక ఇబ్బందులు
వంశీ మోహన్, దేవరకొండ రోడ్డు

దేవరకొండరోడ్డులోని పాత నవీన్ ఐటీఐ గల్లీలో డ్రైనేజీ వ్యవస్థ లేక ఇబ్బందులు పడుతున్నాం.

కమిషనర్: సంబంధిత అధికారులను పంపించి తగు చర్యలు తీసుకుంటాం.

పారిశుధ్య చర్యలు చేపట్టాలి
- చొల్లేటి గిరి, హౌజింగ్‌బోర్డు కాలనీ

మునుగోడు రోడ్డులోని హౌజింగ్ బోర్డు కాలనీలో ఏర్పాటుచేసిన పల్లె ప్రకృతి వనానికి ఒకవైపే మునిసిపల్ సిబ్బంది క్లీనింగ్ చేస్తున్నారు. మరో వైపు అంతా చెత్తచెదారం పేరుకపోతుంది.

కమిషనర్: కాలనీ అంతా క్లీన్ చేసేలా చర్యలు తీసుకుంటాం.

నల్లగొండ
నకిరేకల్ - మునుగోడు

ఆశా వర్కర్స్ యూనియన్ అధ్యక్షురాలిగా వాణి

నార్కట్‌పల్లి, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): సీఐటీయూ అనుబంధ ఆశా వర్కర్స్ యూనియన్ మండడల నూతన కార్యవర్గాన్ని శనివారం ఎన్నుకున్నారు. అధ్యక్షురాలిగా కొండ వాణి, కార్యదర్శి సంద్రగోని సంధ్య, సహాయ కార్యదర్శి ధర్మ రాజేశ్వరి, ఉపాధ్యక్షురాలు శిగ విజయలక్ష్మి, 26 మంది సభ్యులుగా నూతన కమిటీని ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు చింతపల్లి బయ్యన్న, పెంజర్ల సైదులు పాల్గొన్నారు.

సర్వే పరిశీలన

మర్రిగూడ, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇంటింటి సర్వేలో భాగంగా జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఎంపీడీవో బృందం శనివారం ర్యాండమ్ చెక్‌ను పరిశీలించారు. ఇందిరమ్మ ఇంటింటి సర్వే వల్ల అర్హులైన నిరుపేదలకు న్యాయం జరిగే విధంగా చూడాలని ఎంపీడీవో మున్నయ్య ఆదేశించారు. మండలంలోని శివన్నగూడ, తిరుగండ్లపల్లి, మర్రిగూడ, మేటిచంద్రాపురం గ్రామంలో ర్యాండమ్ చెక్‌ను పరిశీలించినట్లు ఆయన తెలిపారు. మండలంలో 92 శాతం ఇంటింటి సర్వే నిర్వహించినట్లు తెలిపారు. ఆయన వెంట డీటీ తారకరామన్, యాకుబ్, యూసుఫ్ పలువురు ఉన్నారు.

ఎల్‌వోసీ అందజేత

చండూరు, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): చండూరు మునిసిపాలిటీకి చెందిన 7వ వార్డుకు చెందిన మహ్మద్ యూసుఫ్ కొంత కాలంగా అనారోగ్యంతో హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. యూసుఫ్ నిరుపేద కావడంతో విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి సీఎం సహాయ నిధి కింద రూ.2.50 లక్షల చెక్కును కుటుంబ సభ్యులకు శనివారం అందజేశారు. కార్యక్రమంలో మునిసిపల్ వైస్ చైర్మన్ దోటి సుజాతవెంకటేష్‌యాదవ్, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు అనంత చంద్రశేఖర్‌గౌడ్, నాయకులు డాక్టర్ కోడి శ్రీనివాసులు, పల్లె వెంకన్న, ఇరిగి వెంకటేశం పాల్గొన్నారు.

ఆర్‌టీఏ సభ్యుడిగా రాజారెడ్డి



రాజారెడ్డి

కనగల్, జనవరి 4: (ఆంధ్రజ్యోతి) మండలంలోని చర్లగౌరారం గ్రామానికి చెందిన యువజన కాంగ్రెస్ నాయకుడు కూసుకుంట్ల రాజారెడ్డి జిల్లా రీజినల్ ట్రాన్స్‌పోర్ట్ అథారిటీ (ఆర్‌టీఏ) సభ్యునిగా నియమితులయ్యారు. రాజారెడ్డి కాంగ్రెస్ పార్టీ యువజన నాయకుడిగా మంచి గుర్తింపును పొందాడు. రాజారెడ్డి నియామకంపై కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గడ్డం అనూప్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ నర్సింగ్ శ్రీనివాస్‌గౌడ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు హర్షం వ్యక్తం చేసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ తన ఎన్నికకు సహకరించిన మంత్రులు వెంకట్‌రెడ్డి, ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు.

టీఎస్‌యూటీఎఫ్ పోస్టర్ ఆవిష్కరణ

కేతేపల్లి, జనవరి 4(ఆంధ్రజ్యోతి): టీఎస్‌యూటీఎఫ్ అధ్యయనంతో అధ్యయనంతో పాటు సామాజిక స్పృహతో ముందుకు సాగుతుందని ఆ సంఘం మండల అధ్యక్షుడు బి.మధు అన్నారు. మండల కేంద్రం కేతేపల్లిలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో శనివారం సంఘం నాయకులతో కలిసి టీఎస్‌యూటీఎఫ్ నూతన క్యాలెండర్, డైరీలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు వై.నర్సిరెడ్డి, సంఘం నాయకులు జయసాగర్, వి.గోపయ్య, ఐ.మనోహర్, ఎ.యాదగిరి, వెంకటేశం, రంజని, సైదులు, అశ్విని, రాజశేఖర్ పాల్గొన్నారు.

సేవాదళ్ అధ్యక్షుడిగా విష్ణు



ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డితో విష్ణు

చండూరు, జనవరి 4(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ సేవాదళ్ మునుగోడు నియోజకవర్గ అధ్యక్షుడిగా పెద్యాల విష్ణు ఎన్నికైనట్లు జిల్లా అధ్యక్షుడు మేకల సాగర్‌రెడ్డి ప్రకటించారు. ఈ మేరకు శనివారం మునుగోడు ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి క్యాంపు కార్యాలయంలో ఆయన నియామాక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం చేపడుతున్న ప్రజా సంక్షేమ పథకాలను ప్రజలకు అందేలా కృషి చేస్తానని అన్నారు. తన నియామకానికి సహకరించిన రాష్ట్ర అధ్యక్షుడు మిద్దెల జితేందర్, జిల్లా అధ్యక్షుడు మేకల సాగర్‌రెడ్డిలకు కృతజ్ఞతలు తెలిపారు.

టీచర్ల సంక్షేమం కోసం కృషి చేస్తున్న యూటీఎఫ్

● ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి



జాతాను ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి

నల్లగొండ టౌన్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల సంక్షేమం, ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణ కోసం యూటీఎఫ్ కృషి చేస్తుందని ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి అన్నారు. ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ స్వర్ణోత్సవం, 11వ మహాసభల జాతాను శుక్రవారం ఆయన జిల్లా కార్యాలయంలో ఆయన రాష్ట్ర అధ్యక్షుడు చావా రవితో కలిసి జెండా ఊపి ప్రారంభించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని కాకినాడలో నిర్వహించే 17వ రాష్ట్ర మహాసభకు ఖమ్మం, హైదరాబాద్, నల్లగొండ నుంచి పతాక జాతా బయలుదేరి వెళ్తున్నట్లు తెలిపారు. రాష్ట్ర ఉపాధ్యాయ ఉద్యమ ఉద్యమంలో యూటీఎఫ్ చురుకుగా ఉందని అన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎ.వెంకట్, రాష్ట్ర కార్యదర్శులు రాజశేఖర్ రెడ్డి, నాగమణి, శాంతికుమారి, శ్రీధర్, వెంకటపతి, రవికుమార్, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బక్కా శ్రీనివాస చారి, పెరుమాళ్ల వెంకటేశం, నాయకులు సైదులు, శ్రీనివాసరెడ్డి, వెంకన్న, నరసింహ, సైదులు యాదయ్య, నరసింహ, విద్యాసాగర్‌రెడ్డి పాల్గొన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

తిప్పర్తి, జనవరి 4(ఆంధ్రజ్యోతి: మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని ఐద్వా జిల్లా ప్రధాన కార్యదర్శి పాలడుగు ప్రభావతి అన్నారు. తిప్పర్తి మండలకేంద్రంలో శనివారం నిర్వహించిన సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వం ఐదు గ్యారెంటీలలో మహిళలకు ఇచ్చిన హామీని తక్షణమే అమలుచేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఐద్వా మండల అధ్యక్షురాలు మాలి భార్గవి, కార్యదర్శి జంజరాల ఉమ, నాయకురాళ్లు, పోకల ఝాన్సీ, బీమగాని విజయ, రాములమ్మ, జ్యోతి, సుజాత, సంతోష తదితరులు పాల్గొన్నారు.

సైన్స్ ఫెయిర్‌లో నక్కలపల్లి జడ్పీ విద్యార్థుల ప్రతిభ

సందర్శకులను ఆకట్టుకున్న వ్యర్థ నీటి శుద్ధి విధానం



వ్యర్థ నీటిశుద్ధి తీరును వివరిస్తున్న విద్యార్థులు

నార్కట్‌పల్లి, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): నల్లగొండలో జరుగుతున్న జిల్లా వైజ్ఞానిక ప్రదర్శనలో మండలంలోని నక్కలపల్లి జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభను చాటారు. పాఠశాల విద్యార్థులు రూపొందించిన వ్యర్థ నీటి శుద్ధి విధానం సందర్శకులను ఆకట్టుకుంది. జిల్లా స్థాయి వైజ్ఞానిక ప్రదర్శనలో మూడో స్థానంలో నిలిచి ప్రశంసలను అందుకుంది. ప్రయోగానికి సంబంధించి గైడ్ టీచరు మారోజు ఉమతో పాటు విద్యార్థులకు శాసనమండలి చైర్మన్ సుఖేందర్‌రెడ్డి అవార్డును అందజేశారు. పరిశ్రమల నుంచి వెలువడే వ్యర్థ నీటిని శుద్ధి చేసే విధానంపై పాఠశాల గైడ్ టీచర్ మారోజు ఉమ ఆధ్వర్యంలో 9వ తరగతి విద్యార్థులు మత్స్యగిరి, లోకేష్, రహమాన్‌లు చేసిన ప్రదర్శన పలువురిని ఆకర్షించింది. ఉపాధ్యాయ మాజీ ఎమ్మెల్సీ పూల రవీందర్‌తో పాటు విద్యాశాఖాధికారులు, పాఠశాల ఉపాధ్యాయులు పలువురు అభినందించారు.

మునిసిపల్ కార్మికులకు కనీస వేతనం ఇవ్వాలి



మునిపాలిటీ ఎదుట నిర్వహించిన ధర్నాలో మాట్లాడుతున్న సలీం

రామగిరి, జనవరి 4(ఆంధ్రజ్యోతి): మునిసిపల్ కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ద్వాక్రా కార్మికులందరికీ కనీస వేతనం రూ. 26వేలు నిర్ణయించి అందజేయాలని తెలంగాణ మునిసిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ (సీఐటీయూ) నల్లగొండ పట్టణ అధ్యక్షుడు, మాజీ కౌన్సిలర్ ఎండి సలీం డిమాండ్ చేశారు. శనివారం తెలంగాణ మునిసిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర కమిటి పిలుపు మేరకు నల్లగొండ మునిసిపల్ కార్యాలయం ఎదుట దర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనేక సంవత్సరాలుగా వివిధ మునిసిపాలిటీల్లో కాంట్రాక్ట్ ఔట్‌సోర్సింగ్ ద్వాక్రా కార్మికులు అతి తక్కువ వేతనాలకు పనిచేస్తున్నారని అన్నారు. సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఆలోపు ఆంధ్రప్రదేశ్‌లో రూ. 21,000 ఇస్తున్నట్లుగా తక్షణం అమలు చేయాలని డిమాండ్ చేశారు. వివిధ విభాగాల్లో పనిచేస్తున్న వారి చదువు మరియు వృత్తి నైపుణ్యతను గుర్తించి పదోన్నతులు కల్పించాలని అన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి దండెంపల్లి సత్తయ్య, మాజీ కౌన్సిలర్ వుట రవీందర్, నాయకులు కోట్ల అశోక్‌రెడ్డి, పేర్ల సంజీవ, పాలడుగు వెంకటేశం, జీడిమెట్ల నరసింహ, కత్తుల కృష్ణవేణి, దాసరి లక్ష్మమ్మ, ఎల్లమ్మ, ఈశ్వరమ్మ, పద్మ, సైదులు పాల్గొన్నారు.

అంధుల కోసం ప్రత్యేకంగా గ్రంథాలయం ఏర్పాటు



లూయిస్ బ్రెయిలీ జయంతి సందర్భంగా కేక్ కట్ చేస్తున్న కలెక్టర్ త్రిపాఠి



బ్రెయిలీకి నివాళులర్పిస్తున్న చొక్కారావు, గోనారెడ్డి

● కలెక్టర్ ఇలా త్రిపాఠి

నల్లగొండ, జనవరి 4(ఆంధ్రజ్యోతి): అంధుల కోసం జిల్లాలో ప్రత్యేకంగా ఒక గ్రంథాలయంతో పాటు బ్రెయిలీ బుక్ లిస్టును తయారు చేయనున్నట్లు కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. అంధుల అక్షర ప్రదాత లూయిస్ బ్రెయిలీ జయంతి సందర్భంగా కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఆమె కేక్ కట్ చేసి ఘనంగా వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం సంక్షేమ పథకాల్లో భాగంగా ఇందిరమ్మ ఇళ్లలో 5 శాతం ఇవ్వాలని అధికారులు ఆదేశించారు. అంధ ఉద్యోగులకు సంబంధించి దూర ప్రాంతాల్లో పనిచేస్తున్న ఆరుగురు ఉపాధ్యాయులను సౌకర్యాలు ఉన్న మైదాన ప్రాంతాల్లోకి డిప్యూటేషన్ వేయాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి కేవీ. కృష్ణవేణి, హౌజింగ్ పీడీ రాజ్‌కుమార్, ఎంప్లాయిమెంట్ అధికారి పద్మ, మోహన్‌రెడ్డి, హరిత, సునీత, నాగిరెడ్డి, వెంకట్‌రెడ్డి, సైదులు, ప్రకాష్ పాల్గొన్నారు.

డ్వాబ్ ఆధ్వర్యంలో...

డ్వాబ్ ఆధ్వర్యంలో సూరదాస్ భవన్‌లో లూయిస్ బ్రెయిలీ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రిటైర్డ్ ప్రిన్సిపాల్, ప్రతీక్‌రెడ్డి ఫౌండేషన్ సీఈవో మారం గోనారెడ్డి మాట్లాడుతూ దివ్యాంగుల 2016 చట్టాన్ని అమలుచేయాలని ప్రభుత్వాన్ని కోరారు. లూయిస్ బ్రెయిలీ అంధులకు ఎంతో సేవ చేశారని తెలిపారు. అనంతరం ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో డ్వాబ్ ప్రధాన కార్యదర్శి, ఏపీసీబీ ఉపాధ్యక్షుడు పొనుగోటి చొక్కారావు, పెండ్యాల దామోదర్‌రావు, నాగులవంచ వెంకటేశ్వర్‌రావు, అశ్విని తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలి

● ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి

మునుగోడు, మునుగోడురూరల్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్ర జలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు అన్ని చర్యలు తీసుకోవాలని ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. శనివారం మునుగోడులోని ఎమ్మెల్యే వ్యక్తిగత క్యాంపు కార్యాలయంలో 'గ్రామీణ ప్రజలు మెరుగైన వైద్యం.. ఆరోగ్య కేంద్రాల్లో సౌకర్యాల కల్పన' వంటి అంశాలపై వైద్య అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో వారు మాట్లాడారు. ప్రభుత్వం ప్రజల వైద్యం కోసం ప్రథమ ప్రాధాన్యత కల్పిస్తోందని తెలిపారు. వైద్య అధికారులు తమ విధులను చిత్తశుద్ధితో నిర్వర్తిస్తూ వైద్య సేవలను సక్రమంగా అందించాలన్నారు. సమావేశంలో నల్లగొండ, యాదాద్రి డీఎంహెచ్‌వోలు డాక్టర్ మధు, డాక్టర్ మనోహర్, డీసీహెచ్ డాక్టర్ మాతృనాయక్, డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ కల్యాణ్ చక్రవర్తి, వివిధ మండలాల వైద్య అధికారులు సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

● నియోజకవర్గంలోని గ్రామాల్లో నీటి స మస్యలు తలెత్తకుండా నీటి సరఫరాపై ప్ర త్యేక శ్రద్ధ చూపాలని ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి మిషన్ భగీరథ అధికారులను ఆదేశించారు. గతంలో దీర్ఘకాలంగా నెలకొన్న ఫ్లోరైడ్ మహమ్మారి జాడలు మళ్లీ వెలుగు చూస్తుండటంతో పాటు రానున్న వేసవిలో నీటి సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. నల్లగొం డ, యాదాద్రి జిల్లాల ఆర్‌డబ్ల్యూఎస్ సీఈ వెంకటేశ్వ ర్లు, కృష్ణయ్య, చౌటుప్పల్, భువనగిరి, నల్లగొండ ఈఈ లు లక్ష్మీనారాయణ, కరుణాకర్, శాంతికుమారి, మునుగోడు డీఈ ముజీబుద్దీన్, వివిధ డీఈలు, ఏఈలు పాల్గొన్నారు.



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న చామల, రాజగోపాల్‌రెడ్డి

● వాహనదారులందరూ హెల్మెట్ ధరించి తమ ప్రాణాలను రక్షించుకోవాలని ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి అన్నారు. రోడ్డు భద్రతా మాసోత్సవాలను పురస్కరించుకొని నియోజకవర్గ కేంద్రంలో పోలీస్ శాఖతో కలిసి రోడ్డు భద్రతపై వాహనదారులకు అవగాహన కల్పించారు. తన మాతృమూర్తి సుశీలమ్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో 300 హెల్మెట్లను ఉచితంగా అందజేశారు. రోడ్డు రవాణా నిబంధనలు తప్పక పాటించాలని కోరారు. కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి, నల్లగొండ డీఎస్పీ శివరాంరెడ్డి, చండూరు సీఐ వెంకటయ్య, ఎస్ఐ ఇరుగు రవి, నాయకులు, మాజీ ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు

అసంపూర్తిగా నిలిచిన డబుల్ బెడ్ ఇళ్లను పూర్తిచేయాలి



నల్లగొండలో డబుల్ బెడ్ రూం ఇళ్లను పరిశీలిస్తున్న తుమ్మల వీరారెడ్డి

కనగల్, నల్లగొండరూరల్, తిప్పర్తి, చిట్యాల, జనవరి 4(ఆంధ్రజ్యోతి): అసంపూర్తిగా నిలిచిన డబుల్ బెడ్ ఇళ్ల నిర్మాణం పనులను వెంటనే పూర్తి చేసి పేదలకు పంపిణీ చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి తుమ్మల వీరారెడ్డి, నాయకులు నంద్యాల నర్సింహారెడ్డి, ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి, దండెంపల్లి సత్తయ్య అన్నారు. జిల్లాలోని కనగల్, నల్లగొండ, తిప్పర్తి, చిట్యాల మండలాల్లో డబుల్ బెడ్ రూం ఇళ్ల ను సీపీఎం మండల కమిటీ సభ్యులతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత పదేళ్లుగా పేదలు డబుల్ బెడ్ ఇళ్ల కోసం ఎదురు చూస్తున్నారని అన్నారు. పేదలకు డబుల్ బెడ్ ఇళ్లు అందని ద్రాక్షగానే మారాయన్నారు. సంబంధిత అధికారులు సగంలో నిలిచిన ఇళ్ల నిర్మాణం పనులను ప్రా రంభించి పూర్తి చేయించాలని డిమాండ్ చేశారు. అన్ని గ్రామాల్లో అర్హులైన వారికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరి చేయాలన్నారు. ఆయా కార్యక్రమాల్లో పాలడుగు ప్రభావతి, కానుగు లింగస్వామి, బ్రహ్మానందరెడ్డి, సుల్తానా, నర్సింహ, బిక్షం, యాదగిరి, రమేష్, పాలడుగు నాగార్జున, కొండ అనురాధ, నలపరాజు సైదులు, అంజయ్య, కొండ వెంకన్న, బొల్లు రవి, ఎండి సలీం, పట్టణ కమిటీ సభ్యులు తుమ్మల పద్మ, గంజి నాగరాజు, కోట్ల అశోక్‌రెడ్డి, జిట్ట నగేష్, అవిశెట్టి శంకరయ్య, జిట్ట సరోజ, నాయకులు కత్తుల లింగస్వామి, బొబ్బల సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్ కమిటీలు రైతులకు అండగా ఉండాలి

● ఎంపీ కిరణ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే సామేలు



నూతన పాలకమండలితో ఎంపీ చామల, ఎమ్మెల్యే సామేలు

శాలిగౌరారం, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం ప్రవేశపెడుతున్న పథకాలను మార్కెట్ కమిటీ పాలకమండలి సభ్యులు రైతులకు అందిస్తూ వారికి అండగా ఉండాలని భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే మందుల సామేలు అన్నారు. శాలిగౌరారం వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన పాలకమండలి ప్రమాణ స్వీకారానికి వారు ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. మార్కెట్ కమిటీ చైర్మన్ పాదూరి శంకర్‌రెడ్డి, వైస్ చైర్మన్ నరిగే నర్సింహ, డైరెక్టర్లను అభినందించి ఘనంగా సన్మానించారు. అనంతరం నిర్వహించిన కార్యక్రమంలో ఎంపీ, ఎమ్మెల్యే మాట్లాడారు. రైతులకు ఒకేసారి రూ.2లక్షల రుణమాఫీ చేసిన ఘనత సీఎం రేవంత్‌రెడ్డికే దక్కిందని అన్నారు. ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలను కాంగ్రెస్ నాయకులు గ్రామాల్లోని ప్రజలకు వివరించాలని కోరారు. మరో 90 రోజుల్లో స్థానిక ఎన్నికలు జరుగుతాయని, దాని దృష్టిలో పెట్టుకొని కార్యకర్తలు కలిసికట్టుగా పనిచేయాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ పి.యాదగిరి, తుంగతుర్తి మార్కెట్ కమిటీ చైర్మన్ తీగల గిరిధర్‌రెడ్డి, సింగిల్‌విండో చైర్మన్ తాళ్లూరి మురళి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కందాల సమరం రెడ్డి, నాయకులు అన్నెబోయిన సుధాకర్, చాడ సురేష్‌రెడ్డి, షేక్ ఇంతియాజ్ అహ్మద్, గూని వెంకటయ్య, నోముల జనార్ధన్, చింత ధనుంజయ్, సురేందర్‌రెడ్డి, అంజయ్య, రవికుమార్, దేవేందర్, బొడ్డు నగేష్, నూతన మార్కెట్ కమిటీ డైరెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

అండర్ గ్రౌండ్ డ్రైనేజీ గుంతలు పూడ్చాలి

నల్లగొండరూరల్, జనవరి 4(ఆంధ్రజ్యోతి): నల్లగొండ పట్టణంలో పలు వార్డుల్లో చేపడుతున్న అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణాల్లో ఏర్పడిన గుంతలు వెంటనే పూడ్చాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు సయ్యద్ హాషం డిమాండ్ చేశారు. శనివారం సీపీఎం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో ప్రజా ఆరోగ్యశాఖ అసిస్టెంట్ ఇంజనీర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నల్లగొండ పట్టణ శివారు ప్రాంత్రాలైన 3,5,6,8,9,18,19,21,25 వార్డుల్లో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణాలు చేపట్టాలని అన్నారు. ఈ వార్డుల్లో పైప్‌లైన్లు తీసిన చోట పోసిన మట్టి కుంగి పోవడం వల్ల పెద్ద గుంతలు ఏర్పడ్డాయని అన్నారు. కొన్నిచోట్ల భూమికి ఎత్తుగా మాన్యువల్స్ కట్టడం వల్ల దాని చుట్టూ గుంతలు పడి ప్రమాదాలు జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. పనుల్లో నాణ్యతా ప్రమాణా చేపట్టకపోవడం వల్లే ఇలాంటి సంఘటనలు జరుగుతున్నాయని ఆరోపించారు. ఇప్పటికైనా అధికారులు స్పందించిన గుంతలు పూడ్చాలని కోరారు. లేనిచో సీపీఎం ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో పట్టణ కార్యదర్శి డి.సత్తయ్య, సలీం, పద్మ, అశోక్‌రెడ్డి, రవీందర్ పాల్గొన్నారు.


ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

నల్లగొండ

5

ఆదివారం 5 జనవరి 2025



హెల్ప్‌లైన్ నంబర్లు

దివ్యాంగులు, సీనియర్ సిటిజన్స్ సంక్షేమ శాఖ టోల్‌ఫ్రీ నెంబర్ 18005728980

నల్లగొండ : 18004251442

యాదాద్రి : 1800 425 7106

సూర్యాపేట : 1800 425 1972

చికెన్ ధరలు

గుడ్డు డజన్ ధర : 84

జిల్లా	లైవ్	డ్రెస్	స్కిన్‌లెస్
యాదాద్రి	రూ.117	190	210
సూర్యాపేట	రూ.125	180	210
నల్లగొండ	రూ.130	180	200

ఉష్ణోగ్రత గరిష్ఠం 29.0 ‌ కనిష్ఠం 17.4



ఆంధ్రజ్యోతి ABN నేడు ముగ్గుల పోటీలు

నల్లగొండ, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండుగను పురస్కరించుకుని 'ఆంధ్రజ్యోతి, ఏబీఎన్ నిర్వహిస్తున్న సంతూర్ ముత్యాల ముగ్గుల పోటీలు, గార్డెనింగ్ పార్ట్‌నర్ క్రాఫ్ట్‌వారి పర్‌ఫెక్ట్, ఫ్యాషన్ పార్ట్‌నర్ డిగిసెల్ వారి సెల్సియా (ట్రెండీ మహిళల ఇన్నర్‌వేర్), లక్ష్మీప్రసన్న 2కె పేయింట్స్ సంయుక్తంగా ఈ నెల 5న ఆదివారం నల్లగొండ ఎన్జీ కళాశాలలో నిర్వహించనున్నారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పోటీలు జరగనున్నాయి. 9985411392, 8074742266 నంబర్లకు ఫోన్‌చేసి పేరు నమోదు చేసుకోవాలని 'ఆంధ్రజ్యోతి' బ్రాంచ్ మేనేజర్ దాసరి చంద్రశేఖర్ ఈ పోటీల్లో విజేతలుగా నిలిచినవారికి బహుమతులు అందజేస్తారు.

మళ్లీ గ్రామస్థాయిలో రెవెన్యూ అధికారి



గ్రామ రెవెన్యూ వ్యవస్థ పునరుద్ధరణకు రంగం సిద్ధమవుతోంది. రెండున్నరేళ్ల క్రితం అవినీతికి పరాకాష్ఠ ఈ వ్యవస్థనంటూ వీఆర్వో పోస్టులను గత బీఆర్ఎస్ సర్కార్ రద్దు చేసి వీఆర్వోలతోపాటు వీఆర్ఏలను ఇతర శాఖల్లో సర్దుబాటు చేసింది. తాజాగా, భూభారతి బిల్లు ఆమోదం పొందడం, రాష్ట్రంలో రెవెన్యూ వ్యవస్థను గాడినపెట్టేందుకు ప్రభుత్వం సిద్ధమయిన నేపథ్యంలో గ్రామస్థాయిలో మళ్లీ వీఆర్వో (విలేజ్ రెవెన్యూ అధికారి) స్థానంలో గ్రామస్థాయి పాలనాధికారిని, సర్వేయర్లను నియమించాలని ప్రభుత్వం నిర్ణయించింది. పోస్టుకు గతంలో పనిచేసిన వీఆర్వోలు, వీఆర్ఏలను దరఖాస్తు చేసుకోవాలని సూచించింది. దీంతో పలువురు వీఆర్వోలు, వీఆర్ఏలు తిరిగి మాతృశాఖకు వచ్చేందుకు సిద్ధమవుతూ దరఖాస్తులను సీసీఎల్ఏకు సమర్పించారు. దరఖాస్తుల స్వీకరణ ఇప్పటికే పూర్తవడంతో, జనవరి నెలాఖరు నాటికి ఉద్యోగాలను ఖరారుచేస్తూ నోటిఫికేషన్ ఇచ్చే అవకాశం ఉందని భావిస్తున్నారు.

- (ఆంధ్రజ్యోతి ప్రతినిధి,నల్లగొండ)

అవినీతి పెరిగిందని, క్షేత్రస్థాయిలో రెవెన్యూ అధికారుల అవసరమేలేదనే అభిప్రాయంతో 2022లో అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం వీఆర్వో వ్యవస్థను రద్దుచేసింది. అప్పటికే వీఆర్వోలుగా, వీఆర్ఏలుగా పనిచేస్తున్నవారిని వారి అర్హతల ఆధారంగా ఇతర శాఖలల్లోకి బదలాయించింది. జూనియర్ అసిస్టెంట్లుగా, సీనియర్ అసిస్టెంట్లుగా, అటెండర్లుగా ఆయా శాఖల్లో వీరంతా పనికి అలవాటుపడలేక మానసిక వేదన అనుభవించిన వారు కూడా ఉన్నారు. వీఆర్వో అంటే గ్రామంలో కీలకమైన అధికారిగా కేవలం భూముల రికార్డుల నిర్వహణకే పరిమితం కాకుండా, అధికారుల పర్యటనలు, ప్రజాప్రతినిధుల పర్యటనల సందర్భంలో కీలకంగా వ్యవహరించేవారు. అలాంటి కీలకమైన వ్యవస్థను గత ప్రభుత్వం నిందారోపణలతో రద్దుచేసిందనే అభిప్రాయంతో ఉన్న వీఆర్వోలు తాజాగా, ప్రభుత్వం మళ్లీ ఈ వ్యవస్థను పునరుద్ధరిస్తుండడంపై హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో 73 మండలాలకు 1,138 రెవెన్యూ గ్రామాలున్నాయి. ప్రస్తుతం ప్రతీ రెవెన్యూ గ్రామానికి ఒక వీఎల్వోను నియమించనున్నారు. రద్దయిన సమయంలో ఉమ్మడి జిల్లాలో 1,015 మంది వీఆర్వోలు, 341 మంది వీఆర్ఏలను ఇతర శాఖలకు బదలాయించారు. వీరందరికీ తాజాగా మళ్లీ రెవెన్యూశాఖలోకి వచ్చేందుకు ఆప్షన్ ఇచ్చారు. వారి విద్యార్హతలు, అనుభవం, వయసు ఆధారంగా దరఖాస్తు చేసుకునేందుకు గత డిసెంబరు 28 వరకు గడువిచ్చారు. ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు తీసుకున్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సుమారు 900 మంది వరకు పాతవీఆర్వోలు, 300 వరకు వీఆర్ఏలు దరఖాస్తు చేసుకున్నట్లు సమాచారం.

- » నెలాఖరులోగా వీఎల్‌వోలు వచ్చే అవకాశం
- » వేరే శాఖల్లోకి బదలాయించిన వీఆర్వోలకు ఆప్షన్
- » వీఆర్‌ఏల వారసులకూ అవకాశమివ్వాలనే సూచనలు
- » గ్రామానికి కీలకంగా రెవెన్యూ అధికారి

గ్రామానికి కీలకమైన అధికారిగా బాధ్యతలు

గ్రామస్థాయిలో పనిచేసే గ్రామ రెవెన్యూ అధికారులు కీలకమైన బాధ్యతలు నిర్వర్తించేవారు. నిజాం హయాం నుంచి రాష్ట్రంలో ఈ వ్యవస్థ కొనసాగుతూ వచ్చింది. భూరికార్డుల నిర్వహణ, గ్రామంలో నిఘా వ్యవస్థతో పాటు, స్వాతంత్ర్యానంతరం భూముల పన్నుల వసూళ్లు, అదేవిధంగా ఆదాయ, కుల ధ్రువీకరణ పత్రాలు,ఎన్నికల సమయంలో గ్రామాధికారిగా విధులు నిర్వహించేవారు. అదేవిధంగా ఏదైనా సంఘటనలు జరిగినప్పుడు క్షేత్రస్థాయి నివేదికలు ఇవ్వడం, ప్రమాదాలు జరిగినప్పుడు ప్రాథమిక సమాచారమివ్వడం, పంచనామాలు....

- మిగతా 7వ పేజీలో...

రెవెన్యూ అధికారిని నియమించాలనే నిర్ణయం హర్షనీయం



గ్రామస్థాయిలో రెవెన్యూ శాఖను మళ్లీ పునరుద్ధరించడం హర్షనీయం. గ్రామస్థాయిలో పనిచేసే రెవెన్యూ అధికారి ప్రభుత్వానికి ప్రతినిధిగా అనేక పనులు నిర్వహించేవారు. పొరపాట్లు, తప్పిదాలు జరిగితే సరిచేసే యంత్రాంగాన్ని నియమించాలి. తప్పులకుపాల్పడితే కఠినశిక్షలు వేయాలే తప్ప వ్యవస్థను రద్దుచేయడం సరికాదు. తాజాగా, ప్రభుత్వం మళ్లీ వీఆర్వో వ్యవస్థను ఏదో రూపంలో ప్రవేశపెట్టాలని నిర్ణయించడాన్ని స్వాగతిస్తున్నాం.

- రంగారావు, నల్లగొండ జిల్లా వీఆర్వోల సంఘం మాజీ అధ్యక్షుడు

బతుకులు ఛిద్రం

- » ప్రీమియర్ ఎక్స్‌ప్లోజివ్స్‌లో భారీ పేలుడు
- » యాదగిరిగుట్ట మండలంలో ఘటన
- » నల్లగొండ జిల్లా తిప్పర్తిలో రోడ్డు ప్రమాదం
- » రెండు ఘటనల్లో ముగ్గురి దుర్మరణం



భువనగిరి ఆస్పత్రి వద్ద రోదిస్తున్న కార్మికుల కుటుంబసభ్యులు

అనుకోని ప్రమాదాలు వారి జీవితాలను ఛిద్రం చేశాయి. పొట్టకూటి కోసం పరిశ్రమకు పనికి వెళితే.. అకస్మాత్తుగా జరిగిన ప్రమాదంలో ఒకరు మృత్యువాత పడగా. ముగ్గురు గాయాలపాలయ్యారు. యాదాద్రి భువనగిరి జిల్లా యాదగిరిగుట్ట మండలంలో ప్రీమియర్ ఎక్స్‌ప్లోజివ్స్‌లో భారీ పేలుడు సంభవించింది. ఈ ఘటనతో కంపెనీ చుట్టుపక్కల గ్రామస్థులు ఉలిక్కిపడ్డారు. ఐదు కిలోమీటర్ల వరకు శబ్దంతో స్థానికులు భయకంపితులయ్యారు. అదే విధంగా నల్లగొండ జిల్లా తిప్పర్తి మండలంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు దుర్మరణం చెందారు. ఈ ఘటనలో ఓ మహిళ, ద్విచక్రవాహనదారుడు మృత్యువాత పడ్డారు.

7

రోడ్డు భద్రతా మాసోత్సవాలు నిర్వహించాలి

కలెక్టర్ ఇలాత్రిపాఠి



వీడియోకాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న మంత్రి పొన్నం, పాల్గొన్న కలెక్టర్ ఇలాత్రిపాఠి, ఎస్పీ శరత్‌చంద్ర పవార్

నల్లగొండ టౌన్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా ఈ 1వ తేదీ నుంచి నెలరోజుల పాటు నిర్వహిస్తున్న రోడ్డు భద్రతా మాసోత్సవాలను విజయవంతం చేయాలని బీసీ సంక్షేమశాఖ, రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. శనివారం హైదరాబాద్ నుంచి రవాణాశాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ వికాస్‌రాజ్‌తో కలిసి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. గతంలో రోడ్డు భద్రత వారోత్సవాలు జరిగేవని, కేంద్ర ప్రభుత్వం రోడ్డు భద్రత ప్రాధాన్యాన్ని దృష్టిలో ఉంచుకొని వారోత్సవాలకు బదులు మాసోత్సవాలు నిర్వహించేందుకు నిర్ణయించినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో అన్ని శాఖలను భాగస్వామ్యం చేయాలని, జిల్లా స్థాయి మొదలు గ్రామస్థాయి వరకు అందరికీ అవగాహన కల్పించాలన్నారు. మండల కేంద్రాలతో పాటు, జిల్లా కేంద్రాల్లో ర్యాలీలు నిర్వహించాలని, అన్నిచోట్ల ఫ్లెక్సీలు ఏర్పాటు చేయాలని, సినిమా థియేటర్లలో స్లైడ్స్ ద్వారా, పోస్టర్లు, బ్యానర్ల ద్వారా ప్రచారం కల్పించాలన్నారు. కలెక్టర్ ఇలాత్రిపాఠి మాట్లాడుతూ, జిల్లా విద్యా వైజ్ఞానిక ప్రదర్శనలో విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు గోడపత్రికను ఆవిష్కరించామన్నారు. జాతీయ రహదారులపై 57 బ్లాక్ స్పాట్స్‌ను గుర్తించి అక్క ప్రమాదాలు జరగకుండా చర్యలు చేపట్టినట్టు వివరించారు. మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డితో పాటు, ఇతర ప్రజాప్రతినిధులను సమన్వయం చేసుకొని జిల్లా, మండల స్థాయిలో నెలాఖరులోపు అవగాహన ర్యాలీలు నిర్వహిస్తామని తెలిపారు. ఎస్పీ శరత్‌చంద్ర పవార్ మాట్లాడుతూ, జిల్లా యంత్రాంగం, పోలీస్‌శాఖతో కలిసి తీసుకున్న చర్యలతో గతంతో పోల్చితే 17 బ్లాక్ స్పాట్స్ తగ్గాయని, ప్రస్తుతం 49 బ్లాక్ స్పాట్స్ ఉన్నాయని వివరించారు. జాతీయ రహదారులపై డ్రైవర్లకు కంటి పరీక్షల నిర్వహణకు ప్రణాళిక రూపొందిస్తున్నామని తెలిపారు. దీంతో మంత్రి పొన్నం స్పందిస్తూ డ్రైవర్లకు కంటి పరీక్షలు నిర్వహించే ఆలోచన వినూత్నంగా ఉందని కలెక్టర్‌ను అభినందించారు. వీడియోకాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ జే.శ్రీనివాస్, జిల్లా రవాణాశాఖ డిప్యూటీ కమిషనర్ వాణి, ఆర్టీవో లావణ్య, తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థుల సృజనాత్మకతను వెలికితీయాలి

- శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి
- ముగిసిన జిల్లాస్థాయి విద్యా వైజ్ఞానిక ప్రదర్శన
- విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బహుమతుల ప్రదానం

7

యాదగిరీశుడికి శాస్త్రోక్తంగా నిత్య పూజలు

సింగిల్‌పర్మిట్‌తోనే మనుగడ



- ఏడాది గడిచినా కొలిక్కిరాని పర్మిట్ విధానం
- లబోదిబోమంటున్న 7వేల మంది లారీ ఓనర్లు

6

కూలి గిట్టుబాటు కావాలి

డీఆర్‌డీఏ పీడీ శేఖర్‌రెడ్డి



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న శేఖర్‌రెడ్డి

మిర్యాలగూడ, మిర్యాలగూడరూరల్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి):ప్రతీ ఉపాధి కూలీకి రోజుకు రూ.300 వేతనం పొందేలా చూడాలని డీఆర్‌డీఏ పీడీ వై.శేఖర్‌రెడ్డి అన్నారు. శనివారం మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన క్లస్టర్ సమావేశంలో ఆయన మాట్లాడారు. రోజుకు 5 నుంచి 6గంటలు కూలీలు పనిచేసేలా చూడాలని, రూ.300 వేతనం పొందేలా కొలతలు నిర్ధారించాలని సూచించారు. విధుల్లో అలసత్వం ప్రదర్శిస్తే క్రమశిక్షణా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పనుల ప్రదేశాన్ని క్షేత్రస్థాయి నుంచి రెండుసార్లు ఫొటో అప్‌లోడ్ చేయాలన్నారు. ప్రతీ గ్రామపంచాయతీలో జనవరిలో 25 మంది, ఫిబ్రవరిలో 50 మంది, మార్చిలో 80మంది కూలీలు పనిచేసేలా చూడాలని సూచించారు. గ్రామాల వారిగా మొక్కల లక్ష్యానికి అనుగుణంగా నర్సరీల్లో బ్యాగ్ ఫిల్లింగ్ పూర్తి చేయాలన్నారు. ప్రతీ గ్రామంలో 1,000 ఈత, తాటి మొక్కలు పెంచాలన్నారు. కమ్యూనిటీ ప్లాంటేషన్ 20శాతం, అవెన్యూ ప్లాంటేషన్ 20 శాతం, బండ్ ప్లాంటేషన్ 20శాతం, ఈత, తాటి 10, తుమ్మ 5, పెరటి మొక్కలు 15, బయో ఫెన్సింగ్ మొక్కలు10 శాతం ఉండేలా నర్సరీల్లో మొక్కలు పెంచాలన్నారు. అనంతరం సోమారిగూడెం, నిడమనూరు ఫీల్డ్ అసిస్టెంట్ బాలకృష్ణ, పంచాయతీ కార్యదర్శి సతీ‌స్‌ను సన్మానించారు. కార్యక్రమంలో అదనపు పీడీ నవీన్ కుమార్, ఏపీడీ బాలకృష్ణ, చారి, తదితరులు పాల్గొన్నారు.

రైతులకు షరతులు దుర్మార్గం

మాజీ మంత్రి జగదీష్‌రెడ్డి

6

రైతులు డిక్లరేషన్ ఇవ్వాలనడం శోచనీయం

ఉద్యోగుల సమ్మెను విరమింపజేయాలి

● ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర కార్యదర్శి నాగరాజు

పెద్దవూర, జనవరి 4(ఆంధ్రజ్యోతి): కేజీబీవీ ఉపాధ్యాయుల సమ్మెను విరమింప జేయాలని ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర కార్యదర్శి తాళ్ల నాగరాజు అన్నారు. శనివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సమగ్ర శిక్ష ఉద్యోగులు ఈనెల 6 నుంచి సమ్మె చేస్తుండగా ఇందులో భాగంగా కేజీబీవీలో బోధన, బోధనేతర సిబ్బంది సమ్మెలో పాల్గొనడంతో విద్యార్థులకు తరగతులు నిర్వహించే వారు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ప్రభుత్వం విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడకుండా సమగ్ర శిక్ష ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. పరీక్షలు సమీపిస్తున్న తరుణంలో విద్యార్థులకు ఈ సమయం కీలకమైనదని దానిని గుర్తించి వెంటనే సమస్యలను పరిష్కరించాలని ఆయన అన్నారు. విద్యార్థులకు పాఠాలు జరిగే విధంగా చర్యలు తీసుకోవాలని ఆయన అన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు ఆకారపు నరేష్, జిల్లా కార్యదర్శి ఖమ్మంపాటి శంకర్, రమావత్ లక్ష్మణ్‌నాయక్, కొరె రమేష్, బుడిగ వెంకటేష్, ముస్కు రవీందర్, నల్లబెల్లి జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

దేవరకొండ డివిజన్‌లో

ఆర్టీఏ కార్యాలయం ఏర్పాటయ్యేదెప్పుడో

- లైసెన్స్, నూతన వాహనాల రిజిస్ట్రేషన్ కోసం ఇబ్బందులు
- మిర్యాలగూడ, నల్లగొండకు వెళ్లాల్సిందే
- పట్టించుకోని ప్రభుత్వం
- ఇబ్బందులు పడుతున్న వాహనదారులు

దేవరకొండ, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): దేవరకొండ డివిజన్ కేంద్రంలో రోడ్డు రవాణా శాఖ మోటార్ వాహనాల తనిఖీ అధికారి ప్రాంతీయ కార్యాలయం లేకపోవడంతో వాహనదారులు లైసెన్సులు తీసుకోవాల్సిన ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. నూతనంగా వాహనాలు తీసుకున్న యజమానులు రిజిస్ట్రేషన్ కోసం, డ్రైవింగ్ లైసెన్స్ కోసం 80 కిలోమీటర్ల దూరంలో ఉన్న మిర్యాలగూడ, దేవరకొండకు 60 కిలోమీటర్ల దూరంలో ఉన్న నల్లగొండకు వెళ్లాల్సిన పరిస్థితి. డివిజన్ పరిధిలోని చందంపేట, నేరేడుగొమ్ము, డిండి, పీఏపల్లి, దేవరకొండ, చింతపల్లి, నాంపల్లి గ్రామాల వాహనదారులు డ్రైవింగ్ లైసెన్స్‌ల కోసం రవాణాశాఖ కార్యాలయానికి వెళ్లాలంటే రెండు నుంచి మూడు రోజులు పడుతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దేవరకొండ, కొండమల్లేపల్లిలో ఇటీవల ట్రాక్టర్, ద్విచక్ర వాహనాల షోరూంలు 10 నుంచి 20 వరకు వెలిసాయి. దీంతో పాటు దేవరకొండ, కొండమల్లేపల్లి లారీ ఓనర్స్ అసోసియేషన్ కొండమల్లేపల్లిలో ఉంది. డ్రైవింగ్ లైసెన్స్ కోసం నూతనంగా కొనుగోలు చేసిన వాహనాలకు రిజిస్ట్రేషన్ కోసం రోజు తరబడి ఇతర ప్రాంతాలకు వెళ్లి ఇబ్బందులు పడాల్సి వస్తుందని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రజా ప్రతినిధులు, జిల్లా ఉన్నతాధికారులు స్పందించి దిన, దిన అభివృద్ధి చెందుతున్న దేవరకొండ డివిజన్ కేంద్రంలో రోడ్డు రవాణాశాఖ ప్రాంతీయ కార్యాలయాన్ని ఏర్పాటు చేసి సమస్యలను పరిష్కరించాలని కోరుతున్నారు.



దేవరకొండ పట్టణం (ఫైల్)

లైసెన్స్ కోసం మిర్యాలగూడ, నల్లగొండకు వెళ్లాల్సి వస్తోంది



నూతనంగా వాహనాలు తీసుకుంటే లైసెన్స్, రిజిస్ట్రేషన్ కోసం ఆర్టీఏ కార్యాలయం లేదు. దీంతో నల్లగొండ, మిర్యాలగూడకు వెళ్లవలసి వస్తుంది. దీంతో రెండు రోజులు పని వృథా అవుతుంది. దేవరకొండలో ఆర్టీఏ కార్యాలయం ఏర్పాటు చేస్తే వాహనదారులందరికి సౌకర్యం ఉంటుంది.

- మోహన్, ఆటో డ్రైవర్, దేవరకొండ

ఆర్టీఏ ప్రాంతీయ కార్యాలయం ఏర్పాటుకు కృషి



దేవరకొండలో ఆర్టీఏ ప్రాంతీయ కార్యాలయం ఏర్పాటుకు కృషి చేస్తా. ఆర్టీఏ కార్యాలయం లేకపోవడంతో వాహనదారులు ఇబ్బందులుపడుతున్నారని ఫిర్యాదులు వస్తున్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నూతనంగా ఆర్టీఏ ప్రాంతీయ కార్యాలయం ఏర్పాటు చేస్తుంది. దేవరకొండకు ఆర్టీఏ ప్రాంతీయ కార్యాలయం ఏర్పాటయ్యేలా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రుల దృష్టికి తీసుకెళ్లి మంజూరయ్యేలా కృషి చేస్తా.

- ఎమ్మెల్యే బాలునాయక్

పెంచిన హమాలీల కూలీ రేట్ల జీవో విడుదల చేయాలి

దేవరకొండ, జనవరి 4(ఆంధ్రజ్యోతి): తెలంగాణ ప్రభుత్వం సివిల్ సప్లయి హమాలీల పెంచిన కూలీ రేట్ల జీవోను వెంటనే విడుదల చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పల్లా నర్సింహారెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం దేవరకొండ సివిల్ సప్లయి గోదాం ఎదుట సీపీఐ, ఏఐటీయూసీ ఆధ్వర్యంలో హమాలీ కార్మికులు నాలుగు రోజులుగా చేస్తున్న సమ్మెకు మద్దతు తెలిపి మాట్లాడారు. ప్రభుత్వం వెంటనే బకాయిలతో సహా జీవోను అమలు చేయాలని రూ.10లక్షల ఆరోగ్యబీమా సౌకర్యం కార్మికులందరికి కల్పించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఏఐటీయూసీ జిల్లా ప్రధానకార్యదర్శి పల్లా దేవేందర్‌రెడ్డి, ప్రజానాట్యమండలి రాష్ట్ర కార్యదర్శి నర్సింహ, నూనె రామస్వామి, ఆంజనేయులు, శ్రీశైలం పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి టాలెంట్ టెస్ట్‌కు ఆదర్శ పాఠశాల విద్యార్థి ఎంపిక

పెద్దఅడిశర్లపల్లి, జనవరి 4(ఆంధ్రజ్యోతి): పీఏపల్లి మండలంలోని ఆదర్శ పాఠశాలకు చెందిన పున్న మణిదీప్ రాష్ట్రస్థాయి టెస్ట్‌కు ఎంపికయ్యాడు. పదో తరగతి విద్యార్థులకు గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ అండ్ గాంధీ జ్ఞాన్ ప్రతిష్ఠాన్ తెలంగాణ సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయ వేదిక ఆధ్వర్యంలో జిల్లా స్థాయి సాంఘిక శాస్త్ర టాలెంట్ టెస్ట్ శనివారం నల్లగొండలో నిర్వహించారు. ఈ పరీక్షలో మణిదీప్ ప్రతిభ చూపాడు. ఈ సందర్భంగా ఆ విద్యార్థి మణిదీప్‌ను పాఠశాల ప్రిన్సిపల్ శ్రీనయ్య, ఉపాధ్యాయులు అభినందించారు.

క్రీడలు శారీరక దృఢత్వానికి దోహదం

నాగార్జునసాగర్,జనవరి4(ఆంధ్రజ్యోతి):క్రీడలతో శారీరక ధృడత్వంతో పాటు మానసిక ఉల్లాసం కలుగుతుందని జెన్‌కో సీఈ మంగేష్‌కుమార్ అన్నారు. సాగర్ పైలాన్ కాలనీలో జెన్‌కో ఆధ్వర్యంలో నిర్వహించబడుతున్న డీఏవీ ఉన్నత పాఠశాలలో శనివారం నిర్వహించిన వార్షిక ఇంటర్ హౌజ్ స్పోర్ట్స్ డే వేడుకలకు ముఖ్య అతిథిగా హజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన క్రీడా జ్యోతిని వెలిగించిన అనంతరం క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలు విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు.

విద్యాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కృషి

హాలియా, జనవరి 4(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం విద్యాభివృద్ధికి అత్యధిక నిధులు కేటాయించి పాఠశాలల్లో అన్ని రకాల మౌలిక సౌకర్యాలు కల్పిస్తూ ఉన్నత ప్రమాణాలతో కూడిన విద్యను అందించేందుకు చర్యలు తీసుకుంటుందని ఎమ్మెల్యే కుందూరు జైవీర్‌రెడ్డి అన్నారు. హాలియాలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శనివారం టీపీఆర్టీయూ అనుముల, పెద్దవూర, తిరుమలగిరి, నిడమనూరు మండలాల శాఖల ఆధ్వర్యంలో నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. గ్రామీణ ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు విలువలతో కూడిన గుణాత్మకమైన విద్యను అందించడంలో టీపీఆర్టీయూ పాత్ర ప్రశంసనీయమన్నారు. కార్యక్రమంలో హాలియా మార్కెట్ కమిటీ చైర్మన్ తుమ్మలపల్లి చంద్రశేఖర్‌రెడ్డి, వైస్ చైర్మన్ కలసాని చంద్రశేఖర్‌యాదవ్, పెద్దవూర ఎంఈవో తరి రాములు, టీపీఆర్టీయూ నాయకులు మంచికంటి మధు, చెన్ను వెంకట్‌రెడ్డి, దండా వీరారెడ్డి, మహేష్‌గౌడ్, పాంపాటి శ్రీనివాస్, మంత్రాల సురేందర్‌రెడ్డి, మొక్క పరుశురాంగౌడ్, కూన్‌రెడ్డి సైదిరెడ్డి, కొల్లి శ్రీనివాస్‌రెడ్డి, మందా సైదులురావుగౌతమ్, పాంపాటి అరవింద్‌కుమార్, హరివర్ధన్, లోక్‌నాథ్, నోవా, జైపాల్‌రెడ్డి, మేదరి దేవేందర్, పాపిరెడ్డి, శ్రీనివాస్, హిమవంత్‌రెడ్డి, దుర్గాప్రసాద్, జానారెడ్డి, కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై నిరంతరం పోరాటం

దేవరకొండ, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలపై సీపీఐ శ్రేణులు ఎర్రజెండా అండగా పోరాటం నిర్వహించాలని సీపీఐ కౌన్సిల్ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే పల్లా వెంకట్‌రెడ్డి పిలుపునిచ్చారు. దేవరకొండ పట్టణంలోని పల్లా పర్వత్‌రెడ్డి భవన్‌లో శనివారం నిర్వహించిన పార్టీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజా సమస్యలపై పోరాడేది కమ్యూనిస్టు పార్టీయేనని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం జిల్లాలోని డిండి, ఎత్తిపోతల, ఎస్‌ఎల్‌బీసీ, నక్కలగండి ప్రాజెక్టులకు అధిక నిధులు కేటాయించి భూనిర్వాసితులందరికీ పునరావాసం, భూపరిహారం అందించాలని డిమాండ్ చేసారు. ప్రజా సమస్యలపై పోరాటాలు నిర్వహించాలని కోరారు. సమావేశంలో సీపై రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పల్లా నర్సింహారెడ్డి, యాదగిరిరావు, పల్లా దేవేందర్‌రెడ్డి, పల్లె నర్సింహ, వెంకటరమణ, బుచ్చిబాబు, కనకాచారి, సుదర్శన్‌రెడ్డి, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

రూ.వంద కోట్లతో మౌలిక సదుపాయాలు



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బాలునాయక్

దేవరకొండ, జనవరి 4(ఆంధ్రజ్యోతి): దేవరకొండ మునిసిపాలిటీకి రూ.వంద కోట్లు కేటాయించి రోడ్లు, మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నట్లు ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ తెలిపారు. దేవరకొండ మునిసిపల్ కార్యాలయంలో శనివారం నిర్వహించిన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. పట్టణంలో పదేళ్లుగా పెండింగ్‌లో ఉన్న రోడ్లను నిర్మించాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. మునిసిపాలిటీ పరిధిలోని రోడ్లకు ఇప్పటికే రూ.30కోట్లు కేటాయించి పనులు ప్రారంభించినట్లు తెలిపారు. మరో రూ.70 కోట్లతో రోడ్ల మరమ్మత్తులు, మౌలిక సదుపాయాలు కల్పిస్తామన్నారు. దేవరకొండ ఖిల్లాలో రూ.5 కోట్లతో ఐదు ఎకరాల్లో నిర్మించిన పార్కు నిర్మాణ పనులు పూర్తయ్యాయని, త్వరలో ప్రారంభించనున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. దేవరకొండ ప్రభుత్వ ఆసుపత్రిని వంద పడకల నుంచి 200 పడకల ఆసుపత్రి గా ఏర్పాటు చేస్తానని తెలిపారు. మునిసిపల్ అధికారులు, ఉద్యోగులు పట్టణంలో తాగునీరు, పారిశుధ్యం సమస్యలు లేకుండా చూడాలని కోరారు. సమావేశంలో మునిసిపల్ చైర్మన్ ఆలంపల్లి నర్సింహ, కమిషనర్ సుదర్శన్, అధికారులు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

మహిళల పేరుమీదే ఇందిరమ్మ ఇల్లు

ప్రభుత్వం ఇటీవల మంజూరు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్లను మహిళల పేరుమీదే మంజూరు చేస్తున్నట్లు ఎమ్మెల్యే బాలునాయక్ తెలిపారు. పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయ ప్రాంగణంలో శనివారం ఇందిరమ్మ ఇళ్ల నమూనా పనులకు శంకుస్థాపన చేసి మాట్లాడారు. సొంత స్థలం ఉన్నవారి ఇంటి నిర్మాణానికి రూ.5లక్షలు ఇల్లు లేని నిరుపేదలకు స్థలాలతో పాటు రూ.5లక్షలు ప్రభుత్వం మంజూరు చేస్తుందన్నారు. గ్రామ, వార్డు సభల్లో ఆమోదం పొందిన తర్వాతే లబ్ధిదారులకు కలెక్టర్ ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డి అర్హులైన పేదలందరికి ఇందిరమ్మ ఇళ్లు అందించడమే లక్ష్యంగా నిధులు మంజూరు చేస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో మునిసిపల్ చైర్మన్ ఆలంపల్లి నర్సింహ, ఎంపీడీవో డానియెల్, మాజీ జడ్పీటీసీ మారేపాకల అరుణ సురేష్‌గౌడ్, వడ్త్య దేవేందర్‌నాయక్ పాల్గొన్నారు.

సత్వర సేవలు అందించాలి: సబ్ కలెక్టర్



తహసీల్దార్ కార్యాలయ భవనాన్ని ప్రారంభిస్తున్న సబ్ కలెక్టర్ నారాయణ్‌అమిత్

మిర్యాలగూడరూరల్, జనవరి 4(ఆంధ్రజ్యోతి): అధికారులు ప్రజలకు సత్వర సేవలు అందించాలని సబ్ కలెక్టర్ నారాయణ్‌అమిత్ అన్నారు. మిర్యాలగూడ తహసీల్దార్ కార్యాలయ అదనపు భవనాన్ని శనివారం ఆయన తహసీల్దార్ హరిబాబుతో కలిసి ప్రారంభించి ప్రత్యేక పూజలు చేశారు. భవన నిర్మాణదాత స్వర్గీయ గుడుగుంట్ల వెంకటయ్య పేరుమీద వారి కుమారులు గణేష్, సుబ్రహ్మణ్యం, అల్లుడు రఘు సహకారంతో నిర్మించారు. ప్రస్తుత పాత భవనం విశాలంగా లేకపోవడంతో ఛాంబర్ సమావేశ హాల్, కంప్యూటర్ రూం, జాయింట్ సబ్ రిజిస్ట్రార్ గదులు ఇరుకుగా ఉండేవి. దాతలు భవనాన్ని నిర్మించడంతో విశాలమైన గదులు, మీటింగ్ హాల్ మెరుగైన సౌకర్యాలు కలిగాయి. ఈ సందర్భంగా సబ్‌కలెక్టర్ నారాయణ్‌అమిత్ మాట్లాడుతూ కార్యాలయానికి వచ్చే ప్రజలకు అధికారులు బాధ్యతతో మెరుగైన సేవలు అందించాలన్నారు. అనంతరం దాతల కుటుంబసభ్యులను, రైస్‌మిల్లర్స్‌ను సబ్ కలెక్టర్ నారాయణ్‌అమిత్, తహసీల్దార్ హరిబాబు శాలువాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో డీఏవో శ్రీనివాస్‌శర్మ, తహసీల్దార్లు జవహర్‌లాల్, సురేష్, డీటీ కల్పన, ఆర్‌ఐలు రామకృష్ణ, సత్యనారాయణ, రైస్ మిల్లర్స్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కర్నాటి రమేష్, మిర్యాలగూడ అధ్యక్షుడు గౌరు శ్రీనివాస్, కార్యదర్శి వెంకటరమణచౌదరి, రైస్ మిల్లర్ రంగా శ్రీధర్, నాయకులు గుడిపాటి నవీన్, చిల్లంచర్ల శ్రీనివాస్, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సాయినాథుని అనుగ్రహం పొందాలి



సాయిసన్నిధిలో త్రిశూలం ప్రతిష్ఠాపనలో పాల్గొన్న శ్రీధర్‌స్వామి

చింతపల్లి, జనవరి 4(ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ సాయినాథుని అనుగ్రహం పొందాలని మక్కామాల పీఠాధిపతి శ్రీధర్‌స్వామి అన్నారు. చింతపల్లి మండల కేంద్రంలోని సాయిసన్నిధిలో శనివారం నూతనంగా శక్తి త్రిశూలాన్ని శివ కిరణ్‌శర్మ వేద మంత్రాలతో ప్రతిష్ఠాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చింతపల్లి సాయిసన్నిధి భక్తులకు పెన్నిధిగా అభివృద్ధి చెందుతుందన్నారు. భక్తులందరూ సాయినాథుని దర్శించుకోవడం వల్ల జీవితంలో కష్టాలు తొలగిపోయే అవకాశం ఉంటుందన్నారు. సనాతన ధర్మ పరిరక్షణ కోసం అందరూ కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ట్రస్టు చైర్మన్ మంచికంటి ధనుంజయ్య, ప్రధాన కార్యదర్శి కొమిరిశెట్టి వెంకటయ్య, వూరె కృష్ణయ్య, కుంభం పుల్లారెడ్డి, శ్రీనివాస్, సుదర్శన్ పాల్గొన్నారు.

దాతల సహకారం అభినందనీయం



స్పోర్ట్స్ యూనిఫామ్ దాత క్రాంతికుమార్, ఎంఈవో శ్రీనయ్య

పెద్దఅడిశర్లపల్లి, జనవరి 4(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధిలో దాతలు అందిస్తున్న సహకారం మరువలేనిదని ఎంఈవో సముద్రాల శ్రీనయ్య అన్నారు. గుడిపల్లి మండలంలోని కేశంనేనిపల్లి ప్రాథమిక పాఠశాలలో దాత వి.క్రాంతికుమార్ రూ.30 వేల ఆర్థిక సాయంతో 42 మందికి రెండు జతల స్పోర్ట్స్ యూనిఫాం, విద్యా సంవత్సరం సరిపడా స్టేషనరీ ఐటమ్స్ శనివారం ఆయన అందజేసి మాట్లాడారు. అంతేకాక దాతలు రమావత్ స్వామి, వనపర్తి జిల్లాకు చెందిన అలాకుంట కృష్ణ రూ.10 వేలు విలువ జేసే గ్యాస్‌స్టవ్, సిలిండర్‌ను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోజు రోజుకి విద్యార్థుల సంఖ్య తగ్గిపోతుండటంతో ఉపాధ్యాయులు విద్యార్థుల సంఖ్యను పెంచేందుకు తనవంతు ప్రయత్నం చేస్తున్నట్లు తెలిపారు. కేశంనేనిపల్లి ప్రాథమిక పాఠశాలలో ఈ విద్యా సంవత్సరం ఆరుగురు విద్యార్థులు మాత్రమే ఉన్నారు. పాఠశాలలో 10 మంది విద్యార్థుల కన్నా తక్కువ మంది ఉంటే మూసివేయాలనే నిబంధన ఉండటంతో పాఠశాలను ఎలాగైనా బలోపేతం చేయాలనే సంకల్పించారు. ఇద్దరు ప్రభుత్వ ఉపాధ్యాయులు డి.శ్రీనివాస్‌రెడ్డి, కె.వెంకట్‌రెడ్డి గ్రామస్థులతో మాట్లాడారు. వారి సలహాలు, సూచనలు తీసుకుని ప్రణాళిక ప్రకారం గ్రామంలోని పాఠశాలలో సమస్యలను పరిష్కరించారు. దీంతో మూతపడే స్థాయి నుంచి 42 మంది విద్యార్థులతో కళకళలాడుతుంది. దీంతో ఎంఈవో దాతలు, ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

నేటి నుంచి సాగర్‌లో 'గిరిజన ఆదివాసీ' శిక్షణ తరగతులు



స్థల పరిశీలన చేస్తున్న కాంగ్రెస్ ఎస్టీసెల్ సాగర్ నియోజకవర్గ అధ్యక్షుడు పాండునాయక్

నాగార్జునసాగర్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా నాగార్జునసాగర్ హిల్‌కాలనీలో ఈ నెల 5వ తేదీ నుంచి 11వ తేదీ వరకు అఖిల భారత గిరిజన ఆదివాసీ కాంగ్రెస్ ప్రతినిధుల శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు కాంగ్రెస్ పార్టీ ఎస్టీ సెల్ సాగర్ నియోజకవర్గ అధ్యక్షుడు సపావత్ పాండునాయక్ తెలిపారు. ఈ శిక్షణ తరగతులకు సాగర్ హిల్‌కాలనీలో ప్రాజెక్టు హౌస్‌లో శనివారం స్థల పరిశీలన చేసి ఆయన మాట్లాడారు. గిరిజన సహకార అభివృద్ధి కార్పొరేషన్ (ట్రైకార్) చైర్మన్ తేజావత్ బెల్లయ్యనాయక్ అధ్యక్షతన నిర్వహించనున్న ఈ శిక్షణ తరగతులకు ముఖ్య అతిథులుగా టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్, మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, సీఎల్పీ మాజీ నేత కుందూరు జానారెడ్డి, ఎంపీ రఘువీర్‌రెడ్డి, ఎమ్మెల్యే జైవీర్‌రెడ్డి, డీసీసీ చైర్మన్ శంకర్‌నాయక్ హాజరుకానున్నట్లు తెలిపారు. స్థల పరిశీలన కార్యక్రమంలో కాంగ్రెస్ ఎస్టీసెల్ నాయకులు నాగేశ్వర్‌నాయక్, మునినాయక్, పాండునాయక్, నాగేంధర్‌నాయక్, కృష్ణ నాయక్, లాలునాయక్, శౌరీనాయక్, హరినాయక్, శంకర్‌నాయక్, తారాసింగ్ తదితరులు పాల్గొన్నారు.

'ఏకపక్ష నిర్ణయాలు తగవు'

నాగార్జునసాగర్, జనవరి4(ఆంధ్రజ్యోతి): బీజేపీ మండల అధ్యక్షుడు ఏరుకొండ నరసింహ ఏకపక్ష నిర్ణయాలు తగవని ఆ పార్టీ జిల్లా నాయకుడు పాల్తి శంకర్‌నాయక్ అన్నారు. శనివారం ఆయన ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ పార్టీ మండల అధ్యక్షుడు సీనియర్ నాయకులను కాదని తన సొంత నిర్ణయాలతో బూతుల్లోకి వచ్చి ఎవరికీ సమాచారం ఇవ్వకుండా వివిధ పార్టీల వారిని కమిటీలో చేర్చుకున్నారని ఆరోపించారు. బూత్ స్థాయిలో వివిధ పార్టీలకు చెందిన నాయకుల పేర్లను తన సొంత నిర్ణయంతో రాసి జిల్లా ఆఫీసుకు పంపించారన్నారు. త్వరలో జరగబోయే మండల పార్టీ అధ్యక్ష ఎన్నికల్లో కొత్త వారికి అవకాశం కల్పించాలన్నారు. బీజేపీ నాయకులు కృష్ణ, శంకర్ నాయక్, నరేష్, అంజనేయులు, రాజశేఖర్ యాదవ్, రవి, జగన్ నాయక్ ఉన్నారు.

అలరించిన విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు

నిడమనూరు, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ముప్పారం గ్రామంలో ప్రాథమిక పాఠశాలలో శనివారం విద్యార్థులు నిర్వహించిన పలు సాంస్కృతిక ప్రదర్శనలు అందరిని ఎంతగానో అలరించాయి. వివిధ అంశాలపై రూపొందించిన నృత్యాలు, నాటికలు ఆకట్టుకున్నాయి. ముఖ్యంగా విద్యతో కలిగే ప్రయోజనాలు, నేటి సమాజంలో సెల్‌ఫోన్‌తో కలిగే అనర్థాలపై చిన్నారులు వేసిన నాటికలు పలువురిని ఆలోజింపచేసే విధంగా ఉన్నాయి. బాలికల కోలాటం కూడా ఆకట్టుకుంది. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎంఈవో లావూరి వెంకన్న మాట్లాడుతూ విద్యార్థులు ఇష్టంతో చదివి ఉన్నత శిఖరాలు చేరుకోవాలని ఆకాక్షించారు. సాంస్కృతిక ప్రదర్శనల్లో ప్రతిభ చూపిన విద్యార్థులను అభినందించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు నూతన మెనూ ప్రకారం నాణ్యమైన మధ్యాహ్న భోజనం అందించాలని ఆదేశించారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ హెడ్మాస్టర్ గౌతమ్, ఏపీసీ చైర్మన్ పాల్వాయి వెంకటమ్మ, హెడ్మాస్టర్ మురారిశెట్టి రమేష్, జడ్పీ ఉన్నత పాఠశాల హెడ్మాస్టర్ శ్రీనివాస్, కోటయ్య, గోవర్ధన్, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులతో ఉపాధ్యాయులు

లబ్ధిదారులకు ఇళ్లను పంపిణీ చేయాలి

మిర్యాలగూడ, జనవరి 4: (ఆంధ్రజ్యోతి): గతంలో ప్రభుత్వం నిర్మించిన ఇందిరమ్మ ఇళ్లను వెంటనే లబ్ధిదారులకు పంపిణీ చేయాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జూలకంటి రంగారెడ్డి అన్నారు. శనివారం రైల్వే గోదాం పక్కన పేదల కోసం నిర్మించిన 560 డబుల్ బెడ్‌రూం ఇళ్లను సీపీఎం నాయకులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో ఇళ్ల పంపిణీ చేసేందుకు లక్కీ డ్రా ద్వారా లబ్ధిదారులను ఎంపిక చేశారని, వారికి ఇళ్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. డబుల్‌బెడ్‌రూం ఇళ్లకు రోడ్లు, డ్రైనేజీ, వీధి దీపాలు, మంచినీటి సౌకర్యం కల్పించాలని అన్నారు. మరమ్మతులకు కావాల్సిన నిధులు వెంటనే మంజూరు చేసి మౌలిక వసతులు కల్పించి లబ్ధిదారులకు అప్పగించాలని అన్నారు. కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు డబ్బీకార్ మల్లేష్, నాయకులు బావండ్ల పాండు, రవినాయక్, రాగిరెడ్డి మంగారెడ్డి, రెమిడాల పరశురాములు, తిరుపతి రాంమూర్తి, అంజద్, గోవర్ధన్, కోటిరెడ్డి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.



డబుల్‌బెడ్‌రూం ఇళ్లను పరిశీలిస్తున్న జూలకంటి రంగారెడ్డి

ఆక్రమణకు గురైన ప్రభుత్వ భూమి స్వాధీనం



స్వాధీనం చేసుకున్న ప్రభుత్వ భూమిలో అధికారులు ఏర్పాటు చేసిన బోర్డు

నేరేడుగొమ్ము, జనవరి 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని కేతేపల్లి గ్రామంలో ఆక్రమణకు గురైన ప్రభుత్వ భూమిని రెవెన్యూ అధికారులు శనివారం స్వాధీనం చేసుకున్నారు. నేరేడుగొమ్ము తహసీల్దార్ శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం.. 30 సంవత్సరాల క్రితం కేతేపల్లికి చెందిన వడ్త్య లచ్చిరాం తన భార్య ఝాన్సీ పేరుమీద 1.23 ఎకరాల ప్రభుత్వ భూమిని అప్పటి పహణీ ద్వారా తహసీల్దార్ ఇచ్చినట్లుగా ఉంది. కాని పట్టా కాలేదు. దీంతో గ్రామస్థులు ప్రభుత్వ భూమిని ఆక్రమించారని ఆ భూమిలో ప్రభుత్వానికి సంబంధించిన గ్రామపంచాయతీ, అంగన్‌వాడీ తదితర భవనాలు నిర్మించడానికి అడ్డుపడుతున్నారని అతనిపై చర్య తీసుకోవాలని మండల అధికారులకు తెలిపారు. దీంతో నేరేడుగొమ్ము తహసీల్దార్ శ్రీనివాస్ కలెక్టర్‌కు విషయం తెలుపగా సర్వే నిర్వహించాలని ఆదేశాలు జారీ చేశారు. తహసీల్దార్ శ్రీనివాస్ కేతేపల్లి గ్రామంలోని శివారులో ఉన్న ప్రభుత్వ భూమిని సర్వే ద్వారా ఎకరం 23గుంటల భూమిని గుర్తించి జేసీబీ సహాయంతో కంపచెట్లను తొలగించి అక్కడ ప్రభుత్వ భూమిగా బోర్డును ఏర్పాటు చేశారు. దేవరకొండ ఆర్డీవో రమణారెడ్డి కేతేపల్లి శివారులో ఉన్న ప్రభుత్వ స్థలం వద్దకు వెళ్లి పరిశీలించారు. ప్రభుత్వ భూములను ఆక్రమించుకుంటే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. భూ ఆక్రమణలు చేస్తే భూమి ఆక్రమించుకొని చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆర్డీవో వెంట ఆర్ఐ వంశీ, సర్వేయర్‌లు శ్రీనివాస్, జయసంగ్, నేరేడుగొమ్ము శిక్షణ ఎస్ఐ లింగయ్య, పెద్ద లచ్చయ్య, నగేష్, పల్స రమేష్ తదితరులు ఉన్నారు.

చదువులో వెనుకబడిన విద్యార్థులపై శ్రద్ధ వహించాలి

హాలియా, జనవరి 4(ఆంధ్రజ్యోతి): వెనుకబడిన విద్యార్థుల ఉత్తీర్ణతకు ప్రత్యేక శ్రద్ధ వహించాలని డీఐఈవో దస్రునాయక్ అన్నారు. హాలియా ప్రభుత్వ జూనియర్ కళాశాలను శనివారం సందర్శించి తరగతి గదులను, ప్రయోగశాలలను పరిశీలించారు. ఉత్తీర్ణత శాతం పెంచేందుకు చదువులో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి పరీక్షలను దృష్ట్యా ముఖ్యమైన ప్రశ్నలను దానికి సంబంధించిన జవాబులను విద్యార్థులకు అందజేయాలని సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జాకీర్‌హుస్సేన్, అధ్యాపకులు శిల్ప, ఆదిరెడ్డి, సంజీవరెడ్డి తదితరులు ఉన్నారు.

ముల్కలకాల్వలో ఉచిత పశువైద్య శిబిరం

మిర్యాలగూడ రూరల్, జనవరి 4(ఆంధ్రజ్యోతి): పశుగణాభివృద్ధి సంస్థ, పశు సంవర్ధకశాఖ ఆధ్వర్యంలో మండలంలోని ముల్కలకాల్వ గ్రామంలో శనివారం గోపాలమిత్ర ఉచిత పశు వైద్య శిబిరాన్ని నిర్వహించారు. మండల పశువైద్యాధికారి డాక్టర్ దుర్గారమాదేవి మాట్లాడుతూ వైద్య శిబిరంలో 52గేదెలకు పలు రకాల వ్యాధులను గుర్తించి వైద్యం అందించామని, 33 దూడలకు నట్టల నివారణ మందులను తాగించినట్లు తెలిపారు. కార్యక్రమంలో వీఎల్‌వో వెంకటేశ్వర్లు, వీఏ శ్రీకాంత్, వీఏ సుబానా, గోపాలమిత్ర సూపర్‌వైజర్ శివారెడ్డి, గోపాలమిత్రలు వెంకట్‌రెడ్డి, ప్రభాకర్, విజయేందర్, శ్రీను, సందీప్, హరికృష్ణ, శ్రీను ఉన్నారు.